రైతు కష్టాల్లో ఉంటే నాయకుడు ఏం చేయాలి?

కష్టాల్లో ఉన్నపుడే వచ్చి పలకరించాలి. కన్నీరు తుడవాలి. కారణాలు కనుక్కోవాలి. ధైర్యం చెప్పాలి. భరోసా ఇవ్వాలి. అధికారంలో ఉంటే - రైతును గట్టెక్కించే చర్యలు తీసుకోవాలి. విపక్షంలోఉంటే- ఏం చేస్తే రైతులకు మేలు జరుగుతుందో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలి. ప్రభుత్వం కదలకపోతే.. కదిలేదాకా రైతులతో కలిసి పోరాడాలి.

మరి జగన్‌రెడ్డి ఏం చేశారు?

చిత్తూరు జిల్లాలో మామిడిసీజన్ ముగిసే వేళకి మండీకి వచ్చారు. రైతుల కష్టాలు వినకుండా తన సహజ ధోరణిలో ఉపన్యాసం ఇచ్చారు. మందీమార్బలంతో రెండు గంటలకు పైగా రోడ్డుమీద షో చేసి, అసలు కార్యక్రమంలో అరగంట కూడా ఉండకుండానే హెలికాప్టర్ ఎక్కి ఎగిరి వెళ్లిపోయారు. జగనన్న పర్యటనలో తమ్ముళ్లు రెచ్చిపోయారు. రోడ్లమీదా, మార్కెట్ యార్డు వద్దా నానా బీభత్సం సృష్టించారు. జనాన్ని భయభ్రాంతుల్ని చేసి, ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌ని చుట్టుముట్టి పిడిగుద్దులు కురిపించి అధికారంలో ఉన్నా లేకున్నా.. మేం మారం ఇంతే అని ప్రకటించుకున్నారు. బంగారుపాళ్యంలో బుధవారం జగన్‌రెడ్డి పర్యటన సందర్భంగా జరిగిన పరిణామాల పరంపర ఇది...

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

సీన్ 1

హెలికాప్టర్ దిగి మార్కెట్ యార్డుకు బయలుదేరిన జగన్ దారి మళ్లించారు. కారణం హైవే మీద జనం జాడ పెద్దగా లేకపోవడం. బంగారుపాళ్యం పట్టణంలో అయితే ట్రాఫిక్ స్తంభించి జనం ఉన్నట్టుగా కనిపిస్తారు. పోలీసు అధికారులు అనుమతించకపోవడంతో అరగంట వాదించారు. ఎస్పీపై ఆగ్రహం ప్రకటించారు.



జగన్నాటకం

సీన్ 2

జగన్ కాన్వాయ్ దగ్గరకు వస్తుండగా వైసీపీ మాజీ సర్పంచి ప్రకాష్‌రెడ్డి తోటలోంచి హఠాత్తుగా ఐదు ట్రాక్టర్లు బయటకు వచ్చాయి. ముందే వాటిని తోతాపురి మామిడి కాయలతో నింపి అక్కడ దాచి ఉంచారు. కాన్వాయ్‌కి ముందు రోడ్డంతా కాయలు పోసుకుంటూ ట్రాక్టర్లు వెళ్లాయి. రైతు కష్టంతో పండిన కాయల్ని తొక్కుకుంటూ జగన్ కాన్వాయ్ ముందుకు దూసుకుపోయింది.



సీన్ 3

బంగారుపాళ్యం మార్కెట్‌యార్డులో వైసీపీ కార్యకర్తలు వీరంగం సృష్టించారు. పోలీసుల ఆదేశాల్ని ఖాతరు చేయకుండా మూసి ఉన్న ప్రధాన గేటును తోసుకుంటూ యార్డులోకి ప్రవేశించారు. మండీల్లోని మామిడి కాయల్ని తొక్కి ధ్వంసం చేశారు. మార్కెట్‌లో షెడ్లపైకి ఎక్కి హల్‌చల్ చేశారు. బంగారుపాళ్యం మార్కెట్‌యార్డులో రైతులు ఎవ్వరూ కనిపించ లేదు. మొత్తం వైసీపీ నాయకులు, కార్యకర్తలే తమ స్వాధీనంలోకి తీసుకున్నారు.

సీన్ 4

ముందే ఎంపిక చేసి రిహార్సల్ చేసుకున్న మండీలోకి జగన్ వెళ్లారు. ఎంపిక చేసుకున్న రైతులతో కాసేపు ముచ్చటించారు. అరగంటకే అక్కడి నుంచి వెనుదిరిగారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకల దాడి

● మామిడి రైతుల పరామర్శ పేరుతో డ్రామాలు

ఉదయం 5గంటలు: హైవే, గ్రామీణ ప్రాంతాల నుంచి బంగారుపాళ్యం వచ్చే దారుల్లో పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు. ఒరిగి పల్లె, మహాసముద్రం టోల్‌ప్లాజా వద్ద నుంచే తనిఖీలు మొదలు పెట్టారు.

ఉదయం 9.00: వైసీపీ కార్యకర్తలు చెక్‌పోస్టుల గుండా కాకుండా రకరకాల దారుల్లో హెలిప్యాడ్ వద్దకు, మార్కెట్ యార్డు దగ్గరకు చేరుకున్నారు.రోడ్ల మీద బైకుల్లో దూసుకుపోతూ, రప్పా రప్పా నరుకుతామని అరుస్తూ హంగామా చేశారు.



రూట్ మార్చొద్దన్న ఎస్పీతో జగన్ వాగ్వాదం

10.30: వైసీపీ శ్రేణులు బంగారుపాళ్యం మార్కెట్‌యార్డు గేట్లను తోసుకుని లోపలికి వెళ్లారు. పోలీసులు చేతులెత్తేశారు.

11.20: జగన్ హెలికాప్టర్ వచ్చి వాలింది. అక్కడ 30 మందికి అనుమతిచ్చినా, 500 మంది లోపలికి చొచ్చుకుని వెళ్లిపోయారు.హెలిప్యాడ్ ప్రాంగణంలో 3 వేలమంది పోగయ్యారు. పోలీసులు లాఠీఛార్జ్ చేసి అదుపు చేశారు.

11.30: ముందుగా వైసీపీ అనుమతి పొందిన మార్గంలో కాకుండా జగన్ కాన్వాయ్ దారి మళ్ళుతోందని తెలిసి చరణ్ దాబా వద్ద ఎస్పీ మణికంఠ జగన్ కాన్వాయ్‌ను అడ్డగించారు. ముందుగా అనుకున్నట్లు హైవే- నలగాంపల్లె ఫ్లైఓవర్ మీదుగా యార్డుకు రావాలని సూచించారు. జగన్ అంగీకరించలేదు. బంగారుపాళ్యం పట్టణంలో నుంచే వస్తానని జగన్ పట్టుపట్టారు. కొంత వాదన జరిగింది. ఎస్పీ ఉన్నా.. కారు ముందుకు పోనివ్వమంటూ డ్రైవర్‌కు జగన్ సూచించారు.

12.00: మరింతమంది పోలీసులతో, వాహనాలతో జగన్ కాన్వాయ్‌కు అడ్డుగా ఎస్పీ నిల్చున్నారు.దీంతో ముందుగా అనుకున్న రూట్ ప్రకారమే హైవే, నలగాంపల్లె ఫ్లైఓవర్ మీదుగా కాన్వాయ్ ప్రయాణం మొదలైంది.

12:30: జనం లేని రోడ్లపై అనుమతి లేకున్నా రోడ్‌షో చేశారు.

12:45: జగన్ రోడ్‌షో ముందుకు రాగానే వైసీపీ మాజీ సర్పంచి ప్రకాష్‌రెడ్డి తన తోటలో దాచి పెట్టుకున్న మామిడి కాయలున్న 5 ట్రాక్టర్లను రోడ్డుమీదకు నడిపించారు. వాటిని రోడ్డుమీద పారబోసుకుంటూ వెళ్లారు.జగన్ కాన్వాయ్, వైసీపీ శ్రేణులు అరుపులు.. ఈలలతో ఆ కాయల్ని తొక్కుకుంటూ ముందుకు సాగాయి.

1.20: బంగారుపాళ్యం పట్టణం పాలూరు క్రాస్ వద్ద కుప్పం వైసీపీ నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. లోపలికి అనుమతించాలని దబాయించడంతో, పోలీసులు కూడా వారిని వదిలేశారు.

1.40: యార్డు గేటు నుంచి మండీలోకి వెళ్లే వరకు రోడ్‌షో చేసుకుంటూ జగన్ మార్కెట్ యార్డులోకి వచ్చారు.

1.50: ముందుగా ఎంపిక చేసిన మండీలోకి వెళ్లి, ముందుగా అనుకున్న రైతులతో కాసేపు మాట్లాడారు.

2.25: మండీ నుంచి హెలిప్యాడ్ వద్దకు జగన్ బయల్దేరారు.

2.45: హెలికాప్టర్ దుమ్ము మిగిల్చి.. బెంగళూరుకు ఎగిరి వెళ్లిపోయింది.

బతుకుతానని అనుకోలేదు

ప్రతిపక్ష నాయకుడు, మాజీ సీఎం కార్యక్రమం కవర్ చేయడానికి మార్కెట్ యార్డులోని 22వ మండీ వద్దకు వెళ్లా. ఫొటోలు తీస్తున్నా. అంతలో అక్కడున్న కొందరు వీడు ఏబీఎన్ వాడు అంటూ అరిచారు. అంతే నామీద ఒక గుంపు పడిపోయారు. దాదాపు 15 మంది పైనే ఉంటారు. కెమెరా లాక్కుని పగలకొట్టేందుకు ప్రయత్నించారు. అక్కడే మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, విజయానందరెడ్డి ఉన్నారు. నేను వాళ్లకు తెలుసు. కాపాడతారని అటు పరుగు తీశా. అయినా గుంపు నన్ను విడిచిపెట్టలేదు. మరోసారి దాడి చేశారు. ఊపిరి ఆడలేదు. తల మీదా, వీపు మీదా పిడిగుద్దులు కురిపిస్తున్నారు. బట్టలు చింపి చిందరవందర చేశారు. ఇక అయిపోయింది అనుకున్నా. బతకను అనుకున్నా. ఎక్కడి లేనీ శక్తి తెచ్చుకుని నెట్టుకుంటూ ఆ మూకలోంచి బయట పడ్డా.

- శివకుమార్, ఆంధ్రజ్యోతి చిత్తూరు స్టాఫ్ ఫొటోగ్రాఫర్



పోలీసు వైఫల్యం

చిత్తూరు ఎస్పీ మణికంఠ ఆధ్వర్యంలో పోలీసులు ముందుగానే జగన్ పర్యటనకు ఆంక్షలు విధించినా అమలు చేయడంలో దారుణంగా విఫలమయ్యారు. చెక్‌పోస్టులు పెట్టి ఆపారు గానీ, పొలాల్లోంచి వచ్చేవారిని అడ్డుకునే ప్రయత్నం చేయలేకపోయారు. చెక్‌పోస్టుల వద్ద కూడా దబాయించి మాట్లాడితే వదిలేశారు. మామిడికాయలు రోడ్డమీద పోస్తారని ముందే తెలిసినా అడ్డుకోలేకపోవడం ఆశ్చర్యం. ఇదే జగన్ ప్రభుత్వంలో అయితే ఇలాగే వ్యవహరించి ఉండేవారా అని జనం మాట్లాడుకున్నారు. లోకేశ్ పాదయాత్ర కుప్పం నుంచి మొదలు పెట్టినపుడూ, చంద్రబాబు పర్యటనల్లోనూ పోలీసులు వ్యవహరించిన తీరు గుర్తు చేసుకున్నారు.



ఫొటోలు తీస్తే చంపేస్తారా?

రక్తం రుచిమరిగిన క్రూరమృగం ఎలా ప్రవర్తిస్తుందో వైసీపీ కార్యకర్తలు కూడా అలాగే ప్రవర్తిస్తున్నారు. వైసీపీ మూకలు దాడి చేస్తుంటే పక్కనే ఉన్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, విజయానందరెడ్డి దగ్గరకు ఆ ఫొటోగ్రాఫర్ వెళ్తే.. మనవాడు కాదని సైగ చేసి మానవత్వం లేకుండా వెళ్లిపోతారా? ఇదేమి దుర్మార్గం?

- మురళీ మోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే

ఎస్‌ఎస్ లింక్ కెనాల్

లిఫ్ట్ పనులకు మోక్షం

తిరుపతిలో టీజీపీ గెస్ట్‌హౌస్ నిర్మాణానికి అనుమతి

మామిడి మద్దతు ధరకు రూ.260 కోట్లు మంజూరు

మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు



ఎస్ఎస్ లింక్ కెనాల్ (ఫైల్ ఫొటో)

తిరుపతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు మేలు చేసే ఎస్ఎస్ లింక్ కెనాల్, మామిడి రైతులకు సబ్సిడీ చెల్లింపుతో పాటు తిరుపతిలో తెలుగుగంగ ప్రాజెక్టు గెస్టహౌస్ నిర్మాణానికి సంబంధించి నిర్ణయాలను బుధవారం అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం తీసుకుంది.

● జిల్లాలో ఆరున్నరేళ్లుగా పెండింగులో ఉన్న సోమశిల స్వర్ణముఖి లింక్ కెనాల్ లిఫ్ట్ పనులకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. ఈ పనులకు 2019 జనవరిలో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.292.66 కోట్లకు పరిపాలనా మంజూరు లభించింది. హైదరాబాదుకు చెందిన మెస్సర్స్ ఎంఈఐఎల్ సంస్థ టెండర్లు దక్కించుకుంది. అదే ఏడాదిలోనే రూ. 250.51 కోట్లతో అగ్రిమెంట్ ఖరారైంది. ఈ నిధులతో మేర్లపాక చెరువు నుంచీ మల్లిమడుగు రిజర్వాయర్‌కు నీటిని తరలించేందుకు కెనాల్, లిఫ్ట్ నిర్మాణాలు చేపట్టాలి. నిర్మాణ సంస్థ పనులు చేపట్టి 12.22 శాతం పనులు పూర్తి చేసింది. దానికోసం రూ.30.61 కోట్లు ఖర్చు చేసింది. తర్వాత ప్రభుత్వం మారడంతో గత వైసీపీ ప్రభుత్వం ఈ పనుల టెండర్లను రద్దు చేసింది. ఆ తర్వాత టెండర్లు పిలవకపోవడంతో పనులు ఆగిపోయాయి. పనులు పూర్తి చేయడానికి రూ.219.90 కోట్లు, భూసేకరణ తదితర ఖర్చుల కోసం రూ.64 లక్షలు కావాలి. తాజాగా మంత్రివర్గం ఈ పనులు చేపట్టేందుకు అనుమతివ్వడంతో త్వరలో పనులు మొదలు కానున్నాయి.

● తిరుపతి చెన్నారెడ్డి కాలనీలో తెలుగు గంగ ప్రాజెక్టు అతిథి గృహం నిర్మాణానికి 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.5.46 కోట్లు మంజూరు చేసింది. మెస్సర్స్ ఐ.మునిమోహన్‌రెడ్డి అండ్ కంపెనీ టెండర్లు దక్కించుకుంది.ప్రభుత్వం మారడంతో ఆలస్యంగా 2023 డిసెంబరులో అగ్రిమెంట్ ఖరారైంది. రూ. 3.78 కోట్లతో చేపట్టాల్సిన పనులు కేవలం రూ.41 లక్షల మేరకే జరిగాయి. ఆ మొత్తాన్నీ కాంట్రాక్టు సంస్థకు చెల్లించలేదు. తిరిగి పనులు మొదలుపెట్టేందుకు మంత్రివర్గం అనుమతిచ్చింది.

మామిడి సబ్సిడీ కింద రూ.260 కోట్లు

ప్రస్తుత సీజనులో ఉమ్మడి చిత్తూరు జిల్లా తోతాపురి మామిడి రైతులు ధరల పతనంలో నష్టపోకుండా ప్రభుత్వం సబ్సిడీ కింద రూ.260 కోట్లు మంజూరు చేస్తూ బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి జిల్లాలో 76,700 మంది రైతులు 80 వేల హెక్టార్లలో తోతాపురి మామిడి సాగు చేస్తున్నారు. ఈ సీజనులో 6.50 లక్షల టన్నుల తోతాపురి మామిడి దిగుబడి వచ్చింది. ఈ మొత్తం సేకరణకుగానూ కిలోకు రూ.4 వంతున సబ్సిడీ ప్రకటించిన ప్రభుత్వం దానికోసం రూ.260 కోట్లు మంజూరు చేసింది. తిరుపతి జిల్లా వరకూ చూస్తే 14,582 హెక్టార్లలో తోతాపురి సాగవుతోంది. ఆ మేరకు 1.45 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. ఈనెల 5వ తేదీ నాటికి జిల్లాలో 10,046 మంది రైతులకు చెందిన 67,988.68 టన్నుల తోతాపురి సేకరించడం జరిగింది. దానికి గానూ రైతులకు సబ్సిడీ కింద రూ. 27.18 కోట్లు చెల్లించాల్సి వుంది. మొత్తం తోతాపురి మామిడి సేకరణ పూర్తయితే సబ్సిడీ కింద రూ. 58 కోట్లు ప్రభుత్వం నుంచీ రైతులకు అందుతుంది.

నేడు మెగా పీటీఎం 2.0

తిరుపతి(విద్య), జూలై 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతోపాటు జూనియర్ కళాశాలల్లో కూడా మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) 2.0 కార్యక్రమం గురువారం జరుగనుంది. ప్రభుత్వ విద్యా సంస్థల్లో మెగా పీటీఎం నిర్వహణకు విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం ఉదయం 9 మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే పీటీఎంలో కలెక్టర్, డీఈవోతో పాటు ప్రజాప్రతినిధులు కూడా పాల్గొననున్నారు. సమగ్రశిక్ష, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈసమావేశానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. ఈ సమావేశానికి తల్లిదండ్రులను సగౌరవంగా ఆహ్వానిస్తున్నామని, మీ పిల్లలతో మన పాఠశాల ఆవరణలో ఆనందంగా గడుపుతూ..వారి విద్యావికాసం, వివిధ అంశాల్లో అభివృద్ధిపై టీచర్లతో చర్చించేందుకే ఇది సదావకాశమని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 3,47,565మంది విద్యార్థులు, తల్లిదండ్రులు సమావేశంలో పాల్గొననున్నారని వివరించారు. శ్రీకాళహస్తి జడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి.. గూడూరు సీఎస్ఎం మున్సిపల్ హైస్కూల్‌లో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, సత్యవేడు ఏపీ రెసిడెన్షియల్ బాయ్స్ స్కూల్‌లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, తిరుపతి మంగళం ట్రెండ్స్ జడ్పీహెచ్ఎస్‌లో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తిరుపతి ఎంజీఎం మున్సిపల్ హైస్కూల్‌లో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, గూడూరు జీఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్లో ఎమ్మెల్సీ మెరిగ మురళీధర్, సూళ్లూరుపేట జడ్పీ బాలికల పాఠశాలలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, వడమాలపేట జడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, చిల్లకూరు జడ్పీహెచ్ఎస్‌లో జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి పాల్గొనన్నారు.

మోడల్ స్కూల్‌లో పాల్గొననున్న కలెక్టర్

వెంకటగిరిటౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో జరిగే విద్యార్థులు, తల్లిదండ్రుల మెగా సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తదితరులు హాజరవుతున్నారని ప్రిన్సిపాల్ తులసీజ్యోతి తెలిపారు. తల్లిదండ్రులందరూ హాజరు కావాలని కోరారు.

ముక్కంటి ఆలయ సెక్యూరిటీ సూపర్‌వైజర్ దాష్టీకం

● మహిళా గార్డుపై దాడి ● బూతు పదజాలంతో వీరంగం

శ్రీకాళహస్తి, జూలై 9(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయంలో సెక్యూరిటీ విభాగ సూపర్‌వైజర్ షణ్ముగం మహిళా గార్డుపై దాష్టీకానికి ఒడిగట్టాడు. తనకు విధులు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించిన గార్డుపై దాడి చేశాడు. ఆలయ ప్రాంగణంలో బూతు పదజాలంతో వీరంగం ప్రదర్శించాడు. ముక్కంటి ఆలయంలో సెక్యూరిటీ గార్డులకు రెండు షిఫ్టులుగా విధులను కేటాయిస్తుంటారు. ఆలయానికి అవసరమైన సంఖ్యకన్నా ముందు జాగ్రత్త కోసం అదనంగా సెక్యూరిటీ గార్డులను నియమించారు. ప్రతిరోజు రొటేషన్ ప్రకారం అందరికీ డ్యూటీలను సూపర్‌వైజర్ కేటాయించాలి. గత వైసీపీ పాలన నుంచి ముక్కంటి ఆలయంలో కొందరు సూపర్‌వైజర్లు తమ ఇష్టానుసారంగా ప్రవర్తించడానికి అలవాటు పడ్డారు.అయిన వారికే ఎక్కువగా డ్యూటీలు కేటాయించేవారు. తమకు వాటాలు సమర్పించే గార్డులను ఆలయంలో అక్రమ ఆదాయం సమకూర్చే చోట్ల మాత్రమే విధులు కేటాయిస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో గీత అనే సెక్యూరిటీ గార్డు బుధవారం మధ్యాహ్నం విధుల కోసం ఆలయం వద్దకు వచ్చారు. పాయింట్ ఖాళీగా లేదని సూపర్‌వైజర్ షణ్ముగం చెప్పాడు. తనకు ఎందుకు అన్యాయం చేస్తావని ప్రశ్నిస్తూ.. అయిన వారికి రోజూ విధులు కేటాయించడంపై నిలదీశారామె. దీంతో ఆగ్రహానికి గురైన షణ్ముగం ఆమెతో దురుసుగా ప్రవర్తించడమే కాకుండా చెయ్యి చేసుకున్నాడు. దీనిపై ఆమె కొందరు అధికారులకు ఫిర్యాదు చేశారు. గత వైసీపీ పాలన నుంచీ షణ్ముగంపై తీవ్రస్థాయి విమర్శలున్నాయి. గతంలో రెండుసార్లు సహచర సిబ్బందిపై రెచ్చిపోయాడు. భరద్వాజతీర్థం వద్ద రాత్రివేళ మద్యం తాగడం, మాంసం తినడంపై రెండేళ్ల క్రితం దుమారం రేగింది. అయినా, అప్పటి వైసీపీ పాలకుల అండతో అతడిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మళ్లీ తాజాగా ఆలయంలో మహిళాగార్డుపై దాడి చేయడం గమనార్హం.

పల్లం నుంచి పూడికి రైలు మార్గం

● 26 కిలోమీటర్ల మేర సర్వే పనులు ప్రారంభం

ఏర్పేడు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు నుంచి పాతవీరాపురం, ఎండీపుత్తూరు మీదుగా వడమాలపేట వద్ద ఉన్న పూడి వరకు (26 కిలోమీటర్లు) కొత్త రైలు మార్గం ఏర్పాటు కానుంది. ఈ మార్గాన్ని పూడి రైల్వే స్టేషన్‌తో అనుసంధానించనున్నారు. సర్వే పనుల్లో భాగంగా బుధవారం సాయంత్రం రైల్వే అధికారులు ఎండీపుత్తూరు వద్ద స్థల పరిశీలన చేశారు. రైల్వే ట్రాక్ నిర్మాణానికి భూమి కోల్పోతున్న రైతులతో త్వరలో సమావేశమై పరిహారం తదితర విషయాలను చర్చించనున్నట్లు తెలిసింది.



ఎండీపుత్తూరు వద్ద స్థల పరిశీలన చేస్తున్నరైల్వే అధికారులు

'విజన్' యూనిట్ల ఏర్పాటుకు రూ.80 లక్షలు

తిరుపతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్వర్ణాంధ్ర విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.80 లక్షలు కేటాయించింది. ఇప్పటికే ఈ యూనిట్లకు అవసరమైన సిబ్బందిని సచివాలయాల నుంచీ కేటాయించిన ప్రభుత్వం తాజాగా నిర్వహణకు అవసరమైన నిధులూ కేటాయించింది. జిల్లా స్థాయి విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ నిర్వహణకు రూ.10 లక్షలు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో యూనిట్ల నిర్వహణకు రూ. 10 లక్షలు చొప్పున మంజూరు చేస్తూ బుధవారం ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

'ఆశా' కార్యకర్తల పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(వైద్యం), జూలై 9(ఆంధ్రజ్యోతి): నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం) కింద జిల్లాలోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల పరిధిలో ఖాళీగా ఉన్న 27 ఆశా కార్యకర్తల పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 16 తేదీలోపు దరఖాస్తులను ఆయా పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లకు అందించాలని పేర్కొన్నారు.

ఓటర్ల జాబితా సవరణ బాధ్యతగా చేయాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మోహన్

పాకాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు సవరణలను బీఎల్‌వోలు బాధ్యతగా నిర్వహించాలని తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ అన్నారు. మండలంలోని బీఎల్‌వోలకు బుధవారం పాకాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి వెరిఫికేషన్ చేసి జాబితాలో మార్పులు చేర్పులు చేయాలన్నారు. ఫాం 6,7,8 ఎలా పూరించాలో డిక్లరేషన్ ఎలా ఇవ్వాలో వివరించారు. ఎపిక్ కార్డుల పంపిణీ సక్రమంగా చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలు సందర్శించి సౌకర్యాల కల్పనకు నివేదికలు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్‌సాయి, డీటీ కళ్యాణ్, జూనియర్ అసిస్టెంట్ వినోద్, వీఆర్వోలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

నూతన పాఠశాల ప్రారంభం

తిరుచానూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పద్మావతిపురం పంచాయతీ వర్నా విశ్వనాథ్ నగర్‌లో కిడ్‌జీ పాఠశాలను బుధవారం ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రారంభించారు. పాఠశాల యాజమాన్యం, సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పర్యటనకు వ్యతిరేకంగా రైతుల నిరసన


కల్‌రోడ్డుపల్లె వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

చంద్రగిరి, జూలై, 9(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ బంగారుపాళెం పర్యటనకు వ్యతిరేకంగా చంద్రగిరి మండలంలోని కల్‌రోడ్డుపల్లె పంచాయతీకి చెందిన రైతులు ప్లకార్డులు, మామిడి కాయలు చేతపట్టుకుని గోబ్యాక్ జగన్ అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ రైతు కొమ్మినేని దామోదరనాయుడు మాట్లాడుతూ మామిడి సీజన్ పోయిన తరువాత వచ్చి రైతులకు ఏంచేస్తారని ప్రశ్నించారు. రైతుల పేరిట పర్యటనలు చేసి, అరాచకం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు బాలకృష్ణ, ప్రసాద్, మురగయ్య, బిందుమాధవి, ఇందుమతి, బేబి, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంఘాల నిరసన


పాకాల ఆర్టీసీ బస్టాండు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాలు

పాకాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం పాకాలలో సీఐ టీయూ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆటో కార్మికు లు, భవన నిర్మాణ కార్మి కులు ఆర్టీసీ బస్టాండు ఎదుట మానవహారం చేపట్టారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయరాదన్నారు. కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేయాలని కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో రామ్మోహన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మధుసూదన్ రావ్, ఏఐటీయూసీ నాయకుడు ప్రకాష్, వివిధ సంఘాల నియకులు ప్రసాద్, వెంకటేష్, నరేంద్ర, సాంబశివ, ధనమ్మ, రజని, మాధవి, నెహరున్నిసా, ఆనంద్, వేణు, చిన్ని, మురళి, చంద్ర, రమణ తదితరులు పాల్గొన్నారు.

పాకాల సింగిల్‌విండో చైర్‌పర్సన్‌గా సావిత్రి



పాకాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పాకాల సింగిల్ విండో చైర్‌పర్సన్‌గా కె సావిత్రి, సభ్యులుగా జి.ఆనంద్, పి.కిరణ్‌కుమార్‌ను నియమించినట్లు ఎమ్మెల్యే పులివర్తి నాని బుధవారం ప్రకటిం చారు. మండలంలోని కావలివారిపల్లెకు చెందిన మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ క్రిష్ణమనేని సావిత్రి చంద్రగిరి నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలిగా సేవలు అందిస్తున్నారు. తనను సింగిల్ విండో చైర్మన్‌గా నియమించిన ఎమ్మెల్యే పులివర్తి నానికి ధన్యవాదాలు తెలిపారు. రైతుల అభివృద్ధికి, సంక్షేమానికి తన వంతు కృషి చేస్తామన్నారు.

సహకార సంఘాల చైర్మన్లు, కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే అభినందనలు

తిరుచానూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో ప్రాథమిక సహకార సంఘాల(సింగిల్‌విండో)లకు చైర్మన్లుగా, కమిటీ సభ్యులుగా నియమితులైన టీడీపీ నాయకులను ఎమ్మెల్యే పులివర్తి నాని అభినందించారు. తనపల్లి రఘునాథ రిసార్ట్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం మల్లంగుంట సింగిల్ విండో చైర్మన్ చెరుకూరు మధుశేఖర్, కమిటీ సభ్యులు చిరంజీవి, మోహన్‌రెడ్డిని అభినందించారు. అలాగే ఎర్రావారిపాళెం, రామచంద్రాపురం, చిన్న గొట్టిగల్లు, ఐతేపల్లి, నరసింగాపురం, పాకాల సింగిల్ విండో చైర్మన్లు, కమిటీ సభ్యులుగా ఎన్నికైన రఘు, జనార్ధన్‌చౌదరి, సుబ్రహ్మణ్యంనాయుడు, వినోద్‌కుమార్‌రెడ్డి, సావిత్రితో పాటు నాగరాజు, దేవేంద్రనాయుడు, శోభారాణి, అలివేలమ్మ, వెంటకముని ఉమామహేశ్వర రావు, రెడ్డెప్పశెట్టి, ఆనంద్ తదితరులను అభినందించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్ర టరీ అమిలినేని మధు, మండల పార్టీ అధ్యక్షులు ఈశ్వర‌రెడ్డి, టీడీపీ నాయకులు సురేంద్ర నాయుడు, కిషోర్‌రెడ్డి, హరేరామ్‌రెడ్డి, గణపతినాయుడు, కళావతి, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లు సింగిల్ విండో అధ్యక్షుడిగా ప్రభాకర్



భాకరాపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు సింగిల్ విండో అధ్యక్షుడిగా జంగావాండ్లపల్లె పంచాయతీ మారసానివారిపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ముత్తం ప్రభాకర్ నియమితులయ్యారు. సభ్యులుగా ఎడంవారిపల్లెకు చెందిన శోభారాణి, పొట్టిగానితోపు గ్రామానికి చెందిన అలివేలమ్మను నియమించారు. ప్రభాకర్ గత టీడీపీ ప్రభుత్వంలో 2015 నుంచి 2019 వరకు సింగిల్ విండో అధ్యక్షుడిగా పని చేశారు. ప్రభాకర్‌ను పలువురు టీడీపీ నాయకులు అభినందించారు.

సప్తగిరికాలనీ గ్రామపంచాయతీ టీడీపీ కమిటీ ఎన్నిక


అల్లాబాషా - హరికృష్ణనాయుడు

తిరుపతి అర్బన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన మంగళంలో పరిధిలోని సప్తగిరికాలనీ గ్రామపంచాయతీ టీడీపీ నూతన కమిటీ ఎట్టకేలకు ఖరారైంది. ఎమ్మెల్యే పులివర్తినాని ఆధ్వర్యంలో బుధవారం కమిటీని ఎంపిక చేయగా తిరుపతి రూరల్ మండలం అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి ప్రకటించారు. అధ్యక్షులుగా అల్లాబాషా, ప్రధాన కార్యదర్శిగా సి.హరికృష్ణనాయుడుతో పాటు సభ్యులను ఎంపికచేశారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గౌస్‌బాషా



చంద్రగిరి, జూలై 9(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా చంద్రగిరికి చెందిన టీడీపీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు గౌస్‌బాషాను నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో విడుదల చేసింది. చంద్రగిరి మార్కెట్ యార్డులో పరిధిలో చంద్రగిరి, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాలు ఉన్నాయి. మార్కెట్ యార్డు గౌరవ అధ్యక్షులుగా ఎమ్మెల్యే పులివర్తి నాని, డైరెక్టర్లుగా జెరిపిట్ట వినోద్‌కుమార్, భీమవరం కామేశ్వరి, చీకటిపల్లి సిద్దారెడ్డి, దేశిరెడ్డి రమణారెడ్డి, దొమ్మలపాటి శాంతి, జూటూరు అనంతలక్ష్మి, గుంతాటి మురళి, కె.నాగరాజ, పి.మునిగీతా, పసుపులేటి శాంతమ్మ, రామిశెట్టి నాగేశ్వరి, కోట వెంకట్రాయులు, మొదాపల్లి మురగేషన్, కె.రాణి, నరసింగాపురం సింగిల్‌విండో చైర్మన్ రాజులగారి వినోద్, అగ్రికల్చర్ ఏడీ, చంద్రగిరి సర్పంచ్ రూపారామ్మూర్తి, అగ్రిట్రేడ్ మార్కెటింగ్ ఆఫీసర్‌లను నియమించారు. ఈసందర్భంగా గౌస్‌బాషా మాట్లాడుతూ తనను చంద్రగిరి మార్కెట్ యార్డు చైర్మన్‌గా ప్రకటించిన ఎమ్మెల్యే పులివర్తి నాని, డీసీఎంఎస్ చైర్మన్ పల్లినేని సుబ్రమణ్యంనాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ తీగలు వేలాడుతున్నాయ్

ఎమ్మెల్యేకు ఫిర్యాదు


స్మశానంలో బోరుమోటారును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తిరుపతి అర్బన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఇంటికి ఆనుకొని ఉన్న స్తంభానికి విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని వర్షం కురుస్తున్నప్పుడు భయమేస్తోందని స్థానికులు కల్పన, దొరస్వామిరెడ్డి దంపతులు ఎమ్మెల్యే నానికి ఫిర్యాదు చేశారు. అలాగే పారిశుధ్య నిర్వహణ సరిగాలేదని, కాలువలు పూడిపోవడంతో మురుగునీరు ఇంట్లోకి చేరుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఎమ్మెల్యే పులివర్తినాని సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమాన్ని బుధవారం ఉదయం మంగళం క్వార్టర్స్‌లోని ఎన్‌సీబీఎన్ కాలనీలో ప్రారంభించారు. ఇంటింటా తిరిగి ప్రభుత్వ పనితీరును, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కొందరు పథకాలు అందలేదని ఆయనకు వినతులు అందించారు. అనంతరం శ్మశానంలో ఏర్పాటుచేసిన బోరుమోటారును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, ఈశ్వరయ్య, సురేష్‌నాయుడు, గోపీనాథ్, మహేశ్వరి, జానకి, పెరుగు భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులయాదవ్, రవిచంద్ర, రామకృష్ణ, బుజ్జి, బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఆలయం వద్ద డ్రమ్స్ శివమణి, కుటుంబసభ్యులు - ఆలయం వద్ద ఏపీ జైళ్ల శాఖ డీజీ అంజనీకుమార్

పద్మావతి అమ్మవారి సేవలో ప్రముఖులు

తిరుచానూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువైన పద్మా వతి అమ్మవారిని బుధవారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. ఏపీ జైళ్ల శాఖ డీజీ అంజనీకుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధి కారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగావారు ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే డ్రమ్స్ శివమణి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ సూపరింటెండెంట్ రమేష్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

భాకరాపేట ఘాట్‌లో బస్సు, లగేజీ వ్యాను ఢీ



చంద్రగిరి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలంలోని భాకరాపేట ఘాట్ రోడ్డులో ఆర్టీసీ బస్సు, లగేజీ వ్యాను ఎదురుఎదురుగా ఢీకొన్నాయి. పోలీసుల కథనం మేరకు.. పీలేరు నుంచి తిరుపతికి ఆర్టీసీ బస్సు వస్తుండగా తిరుపతి నుంచి పీలేరు వైపు లగేజీ వ్యాను వెళుతుండగా ఘాట్ రోడ్డులో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. లగేజీ వ్యాను డ్రైవర్‌కి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేదరిక నిర్మూలన టీడీపీకే సాధ్యం


రామాపురంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరిక నిర్మూలన టీడీపీకే సాధ్యమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కే.నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని రామాపురం గ్రామంలో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రం దివాళా తీస్తే చంద్రబాబు గాడిన పెడుతున్నారన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మునిరామరెడ్డి, గిరిధర్‌రెడ్డి, ధనంజయరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, హరి పాల్గొన్నారు.

ఆర్‌సీపురం సింగిల్ విండో అధ్యక్షుడిగా జనార్దన చౌదరి



రామచంద్రాపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఆర్‌సీపురం సింగిల్ విండో అధ్యక్షుడుగా కమ్మకండ్రిగ గ్రామానికి చెందిన చేకూరి జనార్దనచౌదరిని ప్రభుత్వం నియమించింది. ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

మెగా పేరెంట్స్‌డేకి హాజరు కండి

రామచంద్రాపురం: జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం జరిగే మెగా పేరెంట్స్ సమావేశానికి పాఠశాలల కమిటీలు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, తల్లిదండ్రులు హాజరు కావాలని ఎంఈవో మార్కొండయ్యనాయుడు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. సమావేశానికి హాజరయ్యే వారందరికీ ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వసతి ఉంటుందని తెలియజేశారు.

మల్లంగుంట సింగిల్‌విండో అధ్యక్షుడిగా మధుశేఖర్

తిరుపతిరూరల్,జూలై9(ఆంధ్రజ్యోతి):తిరుపతిరూరల్‌మండలం మల్లంగుంట ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘం(సింగిల్ విండో)అధ్యక్షులుగా సి.మధుశేఖర్‌ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ సభ్యులుగా ఏ.చిరంజీవి, పి.మోహన్‌రెడ్డిని నియమించించింది. వీరిని పలువురు అభినందించారు.

పీఎంఏజీవై అమలుకు అప్రైజల్ కమిటీ

అమరావతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన(పీఎంఏజీవై) పథకం అమలుకు జిల్లా స్థాయి ప్రాజెక్టు అప్రైజల్ కం కన్వర్జెన్స్ కమిటీ ఏర్పాటు చేస్తూ సాంఘిక సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. జిల్లా స్థాయిలో కలెక్టర్/కమిషనర్ చైర్‌పర్సన్‌గా, జడ్పీ సీఈఓ వైస్ చైర్‌పర్సన్‌గాను, పంచాయతీరాజ్ ఎస్‌ఈ, డీఆర్‌డీఏ పీడీ, మహిళా శిశుసంక్షేమశాఖ పీడీ, డీఈఓ, డీఎంఅండ్‌హెచ్‌ఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ, మైనర్ ఇరిగేషన్ ఎస్‌ఈ/ఈఈ, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ, ఎన్‌ఐసీ డీఎం, ఐదు పీఎంఏజీవై గ్రామాల నుంచి ప్రతినిధులు, రాష్ట్ర స్థాయి టెక్నికల్ రిసోర్స్ సపోర్ట్ ఇన్‌స్టిట్యూషన్ నోడల్ అధికారి సభ్యులుగా, సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ మెంబర్ కన్వీనర్‌గా కమిటీని ఏర్పాటు చేస్తూ ఆదేశాలిచ్చారు.

హోటళ్ల నిర్వాహకులతో టీటీడీ సమావేశం

తిరుమల, జూలై9(ఆంధ్రజ్యోతి): తిరుమలకు వచ్చే భక్తులకు బిగ్, జనతా క్యాంటీన్లలో నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని టీటీడీ ఈవో శ్యామలరావు హోటళ్ల నిర్వాహకులను కోరారు. ఈ హోటళ్ల నిర్వహణ కోసం గత నెల 23న నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి హోటళ్ల నిర్వాహకులతో బుధవారం సమావేశమయ్యారు.

వెటర్నరీ వర్సిటీని సందర్శించిన న్యాక్‌పీర్ టీమ్

తిరుపతిరూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఎస్వీవెటర్నరీ వర్సిటీని న్యాక్‌పీర్ టీమ్ మూడ్రోజుల పర్యటనలో భాగంగా బుధవారం కమిటీ సభ్యులు సందర్శించారు. వర్సిటీలో శుక్రవారం వరకూ హైబ్రిడ్ విధానంలో ఈటీమ్ పర్యటన కొనసాగనుంది. తొలిరోజు బుధవారం వర్సిటీ హెడ్ క్వార్టర్, పలు డిపార్ట్‌మెంట్లని ఇద్దరు సభ్యులు సందర్శించి పరిశీలించారు. వీరు సందర్శించే డిపార్ట్‌మెంట్లు, ఇతర అంశాలను నాక్ హెడ్ కేంద్రంలోని బృంద ప్రతినిధులు ఆన్‌లైన్ ద్వారా పర్యవేక్షిస్తున్నారని తెలిసింది. కాగా కమిటీ సభ్యులకు ఆహ్వానం, జ్ఞాపికలు వంటి వాటికి దూరంగా ఉండాలని, మినిమం హాస్పిటాలిటీని మాత్రమే కల్పించేలా చర్యలు చేపట్టాలని ముందుగానే నాక్ హెడ్ కేంద్రం నుంచి వర్సిటీ ఉన్నతాధికారులకు ఉత్తర్వులు అందాయి. ఆమేరకే ఇద్దరు టీమ్ సభ్యులు బుధవారం ఉదయం వర్సిటీ పరిపాలనాభవనానికి సాధారణంగా చేరుకుని..అనంతరం పలు డిపార్ట్‌మెంట్లలో పర్యటించారు. వర్సిటీకి ప్రస్తుతానికి న్యాక్ బీప్లస్‌గ్రేడ్ ఉంది. దీన్ని అప్‌గ్రేడ్ చేసుకునేందుకు ఈపర్యటన నిర్వహిస్తున్నారని వర్సిటీ వర్గాలు అంటున్నాయి.

ఉప్పరపల్లెలో 'తొలి అడుగు'


ఇంటింటా ప్రచారం చేస్తున్న టీడీపీనేతలు

తిరుపతిరూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంట పంచాయతీ పరిధిలోని ఉప్పరపల్లెలో బుధవారం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమపథకాల కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఎమ్మెల్యే నాని నేతృత్వంలో చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు పార్లపల్లి భరత్ కుమార్‌రెడ్డి, ఉప్పరపల్లె బూత్ ఇన్‌చార్జి అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

రైతుసేవా కేంద్రంలో అన్నదాత సుఖీభవ అర్హుల జాబితా

అర్హత ఉన్నరైతులు 13లోపు ఈకేవైసీ చేసుకోవాలి

తిరుపతిరూరల్, జూలై9(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలంలో అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి అర్హులైన రైతుల జాబితాను రైతుసేవాకేంద్రం, సచివాలయంలో ప్రదర్శించారని మండల వ్యవసాయాధికారి సుబ్బారావు పేర్కొన్నారు. మండలంలో 27గ్రామాలకు సంబంధించి 182మంది రైతుల ఈకేవైసీ పెండింగ్‌లో ఉందని, అర్హత ఉన్న రైతులు ఈనెల13లోపు ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు. ఏదైనా గ్రీవెన్స్ ఉన్న రైతులు 13వతేదీలోపు రైతుసేవాకేంద్రాల్లో తమపత్రాలను సమర్పించాలని తెలియజేశారు. భూమికి ఆధార్ లింక్, మ్యుటేషన్, ఇతర సమస్యలను తహసీల్దార్ కార్యాలయంలో సరిచేసుకోవాలని కోరారు.

ఎక్కువమంది రైతులకు వ్యవసాయ పరికరాలు

ఆగ్రోస్ చైర్మన్ సుబ్బానాయుడు

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో తిరిగి ప్రవేశపెట్టిన వ్యవసాయ యాంత్రీకరణ సబ్‌మిషన్ పథకం కింద రైతులకు వ్యక్తిగత పనిముట్లను 2025-26లో ఎక్కువ మందికి అందేలా చూడాలని ఏపీ ఆగ్రోస్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు ఆగ్రోస్ అధికారులను ఆదేశించారు. బుధవారం మంగళగిరి సమీపంలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో జిల్లాల వారీగా ఆగ్రోస్ అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. గత ప్రభుత్వంలో నిర్వీర్యమైన ఆగ్రోస్ అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికతో పాటు కోర్టు కేసులు, బకాయిలు, సంస్థ స్థలాల పరిరక్షణ, వ్యవసాయ పరికరాల అమ్మకం తదితర అంశాలపై చర్చించారు. ఆగ్రోస్ ఎండీ డిల్లీరావు, జీఎం రాజమోహన్, మేనేజర్ కూర్మారావు, ఎస్ఈ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

●ఎరువుల సరఫరాలో కొత లేదు: అగ్రి డైరెక్టర్

రాష్ట్రానికి ఎరువుల సరఫరాపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి కోతలైవిధించలేదని వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు స్పష్టం చేశారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 16.76లక్షల టన్నుల ఎరువులు కేటాయించగా, జూన్ నెలాఖరు నాటికే 5.64లక్షల టన్నులు రాష్ట్రానికి వచ్చినట్లు బుధవారం తెలిపారు.

ప్రాజెక్ట్ లీడ్ ఏజెన్సీగా రైతు సాధికార సంస్థ

అమరావతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కరువు అనుసరణ, ఉపశమనం ద్వారా ప్రకృతి దృశ్య స్థాయి వ్యవసాయ పర్యావరణ పరివర్తన ప్రాజెక్ట్ అమలుకు లీడ్ ఏజెన్సీగా ఏపీ రైతుసాధికార సంస్థను ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర పశుసంవర్ధకశాఖలో ముగ్గురు అదనపు డైరెక్టర్ల తుది సీనియారిటీ జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. ఉద్యానశాఖలో 1,2 స్థాయి గెజిటెడ్ పోస్టుల భర్తీకి ఆ శాఖ డైరెక్టర్ అధ్యక్షతన స్ర్కీనింగ్ కమిటీని ప్రభుత్వం నియమించింది. పట్టు పరిశ్రమశాఖలో ఫీల్డ్ అసిస్టెంట్ కేటగిరిలో 2017 నుంచి ప్రొబేషన్‌లో ఉన్న ఫుల్ టైమ్ కంటింజెంట్ ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించి, ఇప్పటికే రిటైరైన వారికి కోర్టు ఆదేశాల మేరకు పెన్షన్ ప్రయోజనాలు కల్పించేలా ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

సీఏ, సీఎంఏ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విజయకేతనం



విద్యార్థులతో ఎమరాల్డ్స్ డైరెక్టర్లు గిరిధర్, విశ్వనాథ్, పక్కన మునిరత్నం తదితరులు

తిరుపతిరూరల్, జూలై9(ఆంధ్రజ్యోతి): ఎల్‌ఐసీ రోడ్డులోని ఎమరాల్డ్ ప్రొఫెషనల్ అకాడమీ విద్యార్థులు మంగళవారం ప్రకటించిన సీఏ, సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభచాటి విజయకేతనం ఎగురవేశారని డైరెక్టర్లు ఇ.గిరిధర్, కె.విశ్వనాథ్ పేర్కొన్నారు. సీఎంఏలో పి.హర్షిత్ 326మార్కులు, బి.నిరంజన్ 296, డి.తక్లీల్ 292 మార్కులతో టాపర్లుగా నిలచారన్నారు. మొత్తంగా 85.24శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. అలాగే సీఏ ఫలితాల్లో పి.హర్షిత్ 301, ఎం.బాలాజీ 290, బి.నిరంజన్ 289మార్కులతో టాపర్లుగా నిలిచారని, దీనిలో మొత్తంగా 47.37శాతం ఉత్తీర్ణతని నమోదు చేశారని పేర్కొన్నారు. విద్యార్థులను డైరెక్టర్స్‌తోపాటు అసిస్టెంట్ డైరెక్టర్లు ఎస్.మునిరత్నం, టి.నాదమునిరెడ్డి, జానకిరామ్, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు అభినందించారు.

టీచర్ల సప్లిమెంటరీ బిల్లు సమర్పణ గడువు పొడిగించండి

ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ వినతి

తిరుపతి(విద్య), జూలై9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా బదిలీ, పదోన్నతి పొందిన టీచర్ల జూన్ నెల సప్లిమెంటరీ బిల్లు సమర్పణ గడువు ఈనెల 20వరకు పొడిగించాలని ఏపీ ఉపాధ్యాయసంఘ(ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు శవన్నగారి బాలాజీ కోరారు. గతనెల మొదటివారంలో చేపట్టిన బదిలీలు, పదోన్నతుల కారణంగా వేలాదిమంది టీచర్లు కొత్త పాఠశాలలో చేరారని, ఆయా పాఠశాలలో పనిచేసే టీచర్ల క్యాడర్ స్ట్రెంత్, పొజిషన్ ఐడీ కేటాయింపు ఆలస్యమవుతోందని పేర్కొన్నారు. ఈప్రక్రియ పూర్తయిన తర్వాత సప్లిమెంటరీ బిల్లు సమర్పించేందుకు గడువు పొడిగించాలని రాష్ట్ర ఖజానా, లెక్కలశాఖ అధికారులకు వినవించామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఐతేపల్లె, నరసింగాపురం సింగిల్‌విండో చైర్మన్లుగా సుబ్రమణ్యం నాయుడు, వినోద్‌కుమార్‌రెడ్డి


సుబ్రమణ్యంనాయుడు, వినోద్‌కుమార్‌రెడ్డి

చంద్రగిరి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఐతేపల్లె, నరసింగాపురం సింగిల్‌విండో చైర్మన్లు, సభ్యులను ఎమ్మెల్యే పులివర్తి నాని బుధవారం ప్రకటించారు. ఐతేపల్లె సింగిల్‌విండో చైర్మన్‌గా ప్రస్తుతం డీసీఎంఎస్ చైర్మన్‌గా ఉన్న పల్లినేని సుబ్రమణ్యంనాయుడు, మెంబర్లుగా బి.భాస్కర్‌బాబు, ఎం.వెంకటముని, నరసింగాపురం సింగిల్‌విండో చైర్మన్‌గా చంద్రగిరికి చెందిన మండల తెలుగు యువత అధ్యక్షుడు రాజులగారి వినోద్‌కుమార్‌రెడ్డి, మెంబర్లుగా బి.ఉమామహేశ్వరరావు, టి.రెడ్డప్పశెట్టిలను నియమించారు.

చిత్తూరు జిల్లా వైసీపీ సోషల్‌మీడియా జాయింట్ సెక్రటరీగా యోగానందరెడ్డి



తిరుచానూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా సోషల్ మీడియా విభాగం ప్రధాన కార్యదర్శిగా తిరుపతి రూరల్ మండలం బ్రాహ్మణపట్టు ఎంపీటీసీ యోగానందరెడ్డిని ఆ పార్టీ నియమించింది.

వైన్ షాపులో, మార్టులో చోరీ


చంద్రగిరిలో మద్యం దుకాణంలో చోరీ చేస్తున్న దుండగులు

చంద్రగిరి, జూలై9 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలోని మద్యం దుకాణం, వీ మార్టుల లో చోరీ జరిగింది. మంగళవారం రాత్రి 10 గంటలకు చంద్రగిరి కొత్తపేటలోని మద్యం దుకాణానికి తాళం వేసి వెళ్లిపోయారు. వీ మార్టు వారు కూడా తాళాలు వేసుకుని వెళ్లారు. బుధవారం ఉదయం వారు వచ్చేసరికి షట్టర్ తాళాలు పగిలిపోయి ఉన్నాయి. పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వేలి ముద్రలు సేకరించారు. సీసీ కెమెరా ఫుటేజ్‌ను పరిశీలించారు. గుర్తుతెలియని ఇద్దరు దుండగులు ముఖాలకు మాస్కులు, చేతి గ్లౌజులు వేసుకుని చోరీ చేసినట్లు గుర్తించారు. మద్యం దుకాణంలో సుమారు రూ.10 వేల నగదు, రెండు మద్యంబాటిళ్ళు చోరీకి గురయ్యాయి. వీ మార్టులో రూ.1.20 లక్షల నగదు చోరీచేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గజదాడుల నివారణకు చర్యలు

అడిషనల్ పీసీఎఫ్ శాంతిప్రియ పాండే


రాయల్ ఎలిఫెంట్ ప్రాజెక్ట్ బృందానికి మ్యాప్ ద్వారా ఏనుగుల సంచార ప్రాంతాల గురించి వివరిస్తున్న డీఎఫ్‌వో భరణి

కుప్పం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఏనుగుల దాడుల నివారణకు త్వరలోనే చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీఎఫ్) తెలిపారు. రాయల్ ఎలిఫెంట్ ప్రాజెక్ట్ టీమ్‌తో కలిసి ఆమె బుధవారం కుప్పం, పలమనేరు నియోజకవర్గాల పరిధిలోని ఏనుగుల సంచార అటవీ ప్రాంతాలను పరిశీలించారు. కుప్పం మండలంలోని గుడుపల్లె మండలంలోని మల్లప్పకొండ ప్రాంతంలో రాయల్ ఎలిఫెంట్ ప్రాజెక్ట్ టీమ్ పరిశోధనాత్మక పరిశీలన జరిపింది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక కూడలి అయిన కుప్పంలోని పలు సరిహద్దు అటవీ ప్రదేశాలను సందర్శించి ఏనుగులు రాకపోకలు సాగించే మార్గాలు, అవి సంచరించే ప్రదేశాలలో పర్యటించింది. స్థానికుల నుంచి వివరాలను ఆరా తీసింది. పీసీఎఫ్ శాంతిప్రియ పాండే మాట్లాడుతూ ఏనుగుల దాడుల నివారణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. మూడు రాష్ట్రాల కూడలిలో కుప్పం ఉన్నందున దట్టమైన అటవీ ప్రాంతం ద్వారా ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి ఏనుగులు వలసలు వెళ్లడం, సంచరించడం జరుగుతున్నాయన్నారు. ఈ క్రమంలో రైతులు పంటలు నష్టపోవడమే కాక, ప్రాణాలు సైతం కోల్పోవాల్సి వస్తోందని చెప్పారు. రాయల్ ఎలిఫెంట్ ప్రాజెక్ట్ బృందం, డీఎఫ్‌వో భరణి, సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్, ఎలిఫెంట్ గైడ్ రాకేశ్ కాల్వ, కుప్పం ఎఫ్ఆర్వో జయశంకర్, డీఆర్వో సమీర్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో చంద్రబాబుకు సాటిలేరు



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న సుగుణమ్మ, నరసింహయాదవ్, విజయకుమార్ తదితరులు

తిరుపతి(జీవకోన), జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సంక్షేమ పథకాలు అందిండచంలో చంద్రబాబుకు సాటిలేరని నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ, పార్లమెంటు అధ్యక్షులు నరసింహయాదవ్ అన్నారు. బుధవారం నగర పరిధిలోని జీవకోన 49వ డివిజన్ రాజీవ్‌గాంధీ కాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్య క్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. ప్రజల అభిప్రాయాన్ని అడిగి తెలుసుకోగా వారు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేవారు. త్వరలోనే మరిన్ని సంక్షేమ పథకాలు అందుతాయని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ బయోడైవర్శిటీ చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, అన్నా రామకృష్ణ, కీర్తి, అన్నా సంధ్య, ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కుమారమ్మ, చిన్నబాబు, శ్రీనుయాదవ్, మురళి, శ్రీరాములు, లలిత, మల్లికమ్మ సుధాకర్, తిరుమలనాయుడు, లక్ష్మి, శ్యామల, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

డీఎం సుధాకర్‌కు ఘనసన్మానం



తిరుపతి(ఆర్టీసీ), జూలై 9(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ మంగళం డిపో మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన సుధాకర్‌ను బుధవారం ఏపీపీటీడీ కార్మిక పరిషత్(టీఎన్‌టీయూసీ) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గాల్లపాటి రవి, ఉపాధ్యక్షులు జి.సి.నాయుడు, డిపో అధ్యక్షులు ఎం.బాబు, కార్యదర్శి జి.వి.నాయుడు, ఉపాధ్యక్షులు ఎం.గిరి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి పరామర్శ




తిరుపతి, జూలై9(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి నీచమైన వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం తిరుపతి టీడీపీ నేతలు నెల్లూరులోని ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. తిరుపతి తాతయ్యగుంట తీర్థ ప్రసాదాలు అందించారు. ప్రశాంతిరెడ్డిని కలిసినవారిలో డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, టీడీపీ నాయకులు ఊట్ల సురేంద్ర నాయుడు, పాటకం వెంకటేష్ ఉన్నారు.

రేణిగుంట ప్రధాన రహదారికి మోక్షం



తిరుపతి అర్బన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి-రేణిగుంట ప్రధాన రహదారికి ఎట్టికేలకు మోక్షం లభించింది. కొన్ని రోజులు తారువేసే పనులు జోరుగాసాగుతున్నాయి. గత వైసీపీ ఐదేళ్లపాలనలో ఒక్కసారి కూడా తారువేయకపోవడంతో ఆ రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలమయమైంది. ఈ కారణంగా పలువురు వాహన చోదకులు ప్రమాదాలకు గురయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రధాన రహదారులకు మరమ్మతులు చేపట్టి తారువేసే పనులు చేపట్టింది. వాహనచోదకులు, ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

కేంద్ర సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి: ఎంపీ సీఎం రమేష్



తిరుమల, జూలై9(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని ఎంపీ సీఎం రమేష్ అన్నారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో ఏడాది పాలన చక్కగా జరిగిందన్నారు. ఇప్పటికే రాష్ట్రానికి అనేక సాఫ్ట్‌వేర్ కంపెనీలు వచ్చాయన్నారు.

వ్యవసాయ విద్యుత్తు సరఫరాల్లో నేటి నుంచి స్వల్ప మార్పు

తిరుపతి(ఆటోనగర్), జూలై9(ఆంధ్రజ్యోతి): తిరుపతి టౌన్‌డివిజన్ పరిధిలో కేసీపేట 33కేవి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో రైతులకు సరఫరా చేస్తున్న విద్యుత్ సరఫరాలో మార్పులు చేసినట్లు ఆ డివిజన్ ఈఈ చిన్నకోటి చంద్రశేఖర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. భాగ్యనగరం 11కేవి విద్యుత్ ఫీడర్ పరిధిలో ప్రస్తుతం ఉదయం 11గంటలకు విద్యుత్ సరఫరా అవుతోంది. అయితే గురువారం తెల్లవారుజామున 4 గంటల నుంచి సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఈ తాత్కాలిక మార్పును రైతులు గుర్తించి తమ విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

15న తిరుమలలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

● పలు సేవలు, బ్రేక్ దర్శనాలు రద్దు

తిరుమల, జూలై9(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో 15వ తేదీ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) నిర్వహించనున్నారు. 16న ఆణివార ఆస్థానం సందర్భంగా 15న ఉదయం 6 గంటల నుంచి 5 గంటల పాటు తిరుమంజనం కొనసాగనుంది. ఆ రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులకు దర్శనానికి అనుమతిస్తారు. మంగళవారం నిర్వహించే అష్టదళ పాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది. 16న ఆణివార ఆస్థానం రోజు సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి పుష్పపల్లకీలో ు నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ దర్శనమిస్తారు. ఈరోజున కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలు ఉండవు. 15, 16వ తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలను కూడా టీటీడీ రద్దు చేసింది.

తిరుపతి

నేడు మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్

తిరుపతి(విద్య), జూలై9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలో బడివైపు ఒక అడుగు-తల్లిదండ్రులతో ముచ్చట్లు పేరిట గురువారం ఉదయం 9గంటలకు మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ జరగనుంది. సమగ్రశిక్ష, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈసమావేశానికి జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఈవో కేవీఎన్ కుమార్ పేర్కొన్నారు. తల్లిదండ్రులు, టీచర్లు, విద్యార్థులమధ్య సంబంధాలను బలపరచి..మరింత ఉత్తమ ఫలితాలు సాధించేదిశగా ప్రభుత్వం ఈకార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. తల్లిదండ్రులు ఈసమావేశానికి తప్పక హాజరుకావాలని కోరారు. ప్రభుత్వ విద్యాలయాలతోపాటు గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈదఫా ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలో కూడా ఎంపీటీఎం నిర్వహిస్తున్నారు. జిల్లాలో మొత్తం 3,47,565మంది విద్యార్థులు, తల్లిదండ్రులు ఈసమావేశంలో పాల్గొననున్నారని తెలిపారు.

కుటుంబ తగాదాలతో వ్యాన్ డ్రైవర్ ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), జూలై 9(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వ్యాన్‌డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం తిరుపతిలో చోటు చేసుకుంది. స్థానిక తాతయ్యగుంటకు చెందిన పరమేశ్వరి తిరుమలలో ఔట్‌సోర్సింగ్‌లో స్వీపర్‌గా పనిచేస్తోంది. ఆమె భర్త గణేషన్ శ్రీనివాసం వద్ద వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం అయింది. రెండు రోజుల క్రితం కుమార్తె ప్రవీణ పుట్టింటికి వచ్చింది. ఈ నేపథ్యంలో మద్యం సేవించి ఇంటికి వచ్చిన గణేషన్ భార్య, కుమార్తెతో గొడవపడ్డాడు. మళ్లీ మద్యం కోసం డబ్బులు కావాలని డిమాండ్ చేశాడు. అతనితో ఘర్షణ పడలేక ఇంట్లో నుంచి బయటకు వచ్చారు. ఆ సమయంలో అతడు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌కాల్ డ్రైవర్లుగా అవకాశం

తిరుపతి(ఆర్టీసీ), జూలై 9(ఆంధ్రజ్యోతి): ఆన్‌కాల్ డ్రైవర్లకు అకాశం కల్పిస్తున్నామని మంగళం డిపో మేనేజర్ సుధాకర్ బుధవారం తెలిపారు. తన చాంబర్‌లో ఆయన మాట్లాడుతూ డిపో పరిధిలో 46మంది డ్రైవర్లు కొరత ఉందన్నారు. ఈ క్రమంలో తాత్కాలిక డ్రైవర్లను తీసుకుంటామన్నారు. ఏడాదిన్నర కాలం హెవీ వెయికల్ డ్రైవింగ్ లైసెన్స్ పూర్తయి ఉండాలని, ఆర్టీవో క్లియరెన్స్ సర్టిఫికెట్, ఆధార్, ఒరిజనల్ లైసెన్స్, 45సంవత్సరాల్లోపు వయస్సు ఉన్నవారికి అవకాశమని స్పష్టం చేశారు. రోజు వేతనం చెల్లిస్తామని, ఈనెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 9177150347(స్డీఐ)నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

డీపీటీవోకు సన్మానం



తిరుపతి(ఆర్టీసీ), జూలై 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డీపీటీవో జగదీష్‌ను బుధవారం ఉదయం కార్మికపరిషత్ జిల్లా కార్యవర్గం మర్యాదపూర్వకంగా కలిసింది. శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ సందర్భంగా తాము ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను డీపీటీవో దృష్టికి తీసుకురాగా సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రీజనల్ సెక్రటరి జి.రవి, తిరుపతి డిపో అధ్యక్షుడు కె.ఎం.రత్నం, సెక్రటరి సి.మాధవయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు రజిత, తిరుపతి డిపో అధ్యక్షురాలు భారతి, జి.వి.నాయుడు ఎన్.ఎన్.కుమార్, మహేష్, లక్ష్మణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తే సహించం

● విద్యుత్ జేఏసీ హెచ్చరిక

● డిస్కం కార్యాలయం ఎదుట ధర్నా



సదరన్ డిస్కం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

తిరుపతి(ఆటోనగర్), జూలై 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తే సహించేది లేదని విద్యుత్ ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు రాఘవ రెడ్డి, పుల్లా బాలాజీ, ఎల్.చలపతి, దేవేంద్రరెడ్డి, జయరామ్, మురళీధర్‌లు హెచ్చరించారు. తిరుపతి సదరన్ డిస్కం కార్పొరేట్ కార్యాలయం ఎదుట బుధవారం విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో నిరసన ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను అడ్డుకోవాల్సిన అవసరం వేదన్నారు. ఉత్తర ప్రదేశ్‌లో అక్కడి ప్రభుత్వం రెండు డిస్కంలను ప్రైవేటు పరం చేసిందన్నారు. యూపీలో ప్రభుత్వం అమలు చేసేది విజయవంతమైతే, మన రాష్ట్రంలోనూ కూటమి ప్రభుత్వం విద్యుత్ సంస్థలను ప్రైవేట్ పరం చేయడానికి సిద్ధపడుతుందని హెచ్చరించారు. ప్రైవేటీకరణ జరిగితే రాయితీలు రద్దు చేయడం ఖాయమన్నారు. ఉద్యోగ భద్రత ఉండదన్నారు. అందుకే ఉద్యోగులు సంఘటితంగా ప్రైవేటీకరణను వ్యతిరేకించడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కేంద్రలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్‌లు ప్రవేశ పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా నిర్వహించిన సార్వత్రిక సమ్మెకు వారు సంఘీభావం తెలిపారు. ఈ ధర్నాలో నాయకులు రమేష్ బాబు, జయప్రకాష్, నాగరాజు, నీలం నరేంద్రనాథ్, వి.చంద్రశేఖర్‌రావు, వెలగటూరు గోపి,మస్తాన్‌లతో పాటు మహిళా ఉద్యోగినులు, ఇతర శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

మోదీ, అమిత్‌షా దేశ ద్రోహులు

సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ





ర్యాలీగా వస్తున్న కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు, ఆశ కార్యకర్తలు

తిరుపతి(ఆటోనగర్), జూలై9(ఆంధ్రజ్యోతి): వంద సంవత్సరాల క్రితం సాధించుకున్న కార్మిక చట్టాలకు సవరణలు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులను బానిసలుగా చేసిన ప్రధాని మోదీ, అమిత్‌షాలు దేశద్రోహులని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మండిపడ్డారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా నాలుగుకాళ్ల మండపం వద్ద బుధవారం జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. సీఐటీయూ నాయకులు కందారపు మురళి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు 8గంటల పని విధానానికి పాతర వేసి 10 గంటలకు శ్రీకారం చుట్టడం గర్హనీయమని మండిపడ్డారు. ఐఎఫ్‌టీయూ నాయకుడు వెంకటరత్నం మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. ఈ సభలో నాయకులు రాధాక్రిష్ణ, హేమావతి, ఎన్‌డీ రవి, నాగరాజమ్మ, గంగాభవాని, లోకేష్, మాధవ్, వేణు, సుబ్రమణ్యం, జయచంద్ర, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

● జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద సీఐటీయూ కార్యదర్శి జయచంద్ర ఆధ్వర్యంలో నల్లదుస్తులు ధరించి మానవ హారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నినాదాలు చేశారు. అక్కడ నుంచి ర్యాలీగా నాలుగు కాళ్ల మండపం వద్దకు చేరుకున్నారు.

● సీఐటీయూ అధ్వర్యంలో సీపీఎం కార్యాలయం నుంచి ఉద్యోగులు, కార్మికులు ర్యాలీగా నాలుగు కాళ్ల మండపానికి చేరుకున్నారు.

● ఐఎఫ్‌టీయూ, ఏఐటీయూసీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు, ఉద్యోగులు ర్యాలీగా నాలుగు కాళ్ల మడపం వద్దకు చేరుకున్నారు.

కష్టపడేవారికి బీజేపీలో గుర్తింపు



ఎంపీ సత్యనారాయణను సన్మానిస్తున్న శ్రీనివాస్, అజయ్, వరప్రసాద్,

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 9(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యులుగా ఎన్నికై మొదటిసారి తిరుపతికి వచ్చిన బీజేపీ సీనియర్ నాయకులు పాక సత్యనారాయణను స్థానిక ఆర్ఎస్ మాడావీధిలో జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ అజయ్‌కుమార్, వరప్రసాద్ తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ కష్టపడే వారికి బీజేపీలో గుర్తింపు లభిస్తుందనడానికి తాను ఉదాహరణ అన్నారు. కూటమిలో బీజేపీ కీలకమని రాబోవు కాలంలో మనబలం పెంచుకోవడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయని పేర్కొన్నారు. నాయకులు కార్యాలయాలకు పరిమితం కాకుండా ప్రజల మధ్యలో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దీపక్‌యాదవ్, దస్తగిరి ప్రభాకర్, సుబ్బుయాదవ్, అశోక్, నవీన్, జయంత్ పాల్గొన్నారు.

వైద్యరంగంలో నూతన అధ్యయనాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రవిప్రభు

తిరుపతి(వైద్యం), జూలై 9(ఆంధ్రజ్యోతి): వైద్యరంగంలో చోటుచేసుకుంటున్న నూతన అధ్యయనాలు , ఆధునిక వైద్య పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభు పేర్కొన్నారు. ఎస్వీ వైద్య కళాశాలలో వైద్య అధ్యాపకులకు నిర్వహించే నిరంతర వైద్య విద్యలో భాగంగా బేసిక్ కోర్స్ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్ పేరుతో బుధవారం ప్రారంభించిన మూడు రోజుల శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైద్య విద్య బోధనలోనూ నూతన పద్ధతులను తెలుసుకునేందుకు వైద్య విద్యార్థులకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. వేలూరు సీఎంసీ వైద్య కళాశాలకు చెందిన డాక్టర్ మినురేఖ, డాక్టర్ శోభన రాజన్ ఆధ్వర్యంలో వైద్య అధ్యాపకులకు ఈ శిక్షణా తరగతులు మూడు రోజులపాటు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రుయా సూపరింటెండెంట్ రాధ, వైద్య విభాగాధిపతులు మనోహర్, ఉమాదేవి, కిరీటి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి బెస్ట్ డెస్టినీ

● క్రెడాయ్ ఎక్స్‌పో బ్రోచర్ ఆవిష్కరణలో తుడా చైర్మన్



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, క్రెడాయ్ చైర్మన్ గోపీనాథ్ తదితరులు

తిరుపతి, జూలై9(ఆంధ్రజ్యోతి): దినదినాభివృద్ధి చెందుతున్న ఆధ్యాత్మిక నగరమైన తిరుపతి బెస్ట్ డెస్టినీగా గుర్తింపుపొందిందని ఈక్రమంలో విల్లాలు, డూప్లెక్స్ హౌస్, అపార్ట్‌మెంట్లు ఎక్కువవుతున్నాయని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి అన్నారు. తిరుపతిలో సెప్టెంబరు 5, 6, 7 తేదీలలో జరగనున్న క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పోకి సంబంధించి కర్టెన్‌రైజింగ్ ప్రోగ్రాం బుధవారం ఓ ప్రైవేట్ హోటల్లో జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన తుడా చైర్మన్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రెడాయ్ లాంటి నమ్మకమైన సంస్థ ప్రజల అవసరాలను గుర్తించి నిర్మాణాలను చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. తిరుపతి చుట్టుపక్కల 25 కి.మీ పరిధిలో ప్రత్యేక అభివృద్ధికి తుడా ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టామన్నారు. అనంతరం క్రెడాయ్ సంస్థలో ఇంటర్న్‌షిప్ చేసిన ఇంజనీరింగ్ విద్యార్థులకు తుడా చైర్మన్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ తిరుపతి చాప్టర్ చైర్మన్ గోపీనాథ్, అధ్యక్షుడు రాంప్రసాద్, ఉపాధ్యక్షుడు రాజేష్ బాబు, కార్యదర్శి నరసింహా రెడ్డి, ఎస్‌బీఐ డీజీఎం దినేష్, ఇతర బ్యాంక్ అధికారులు, క్రెడాయ్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు





స్వామి అమ్మవార్లను ఊరేగిస్తున్న ఆలయ అధికారులు, హోమం నిర్వహిస్తున్న పండితులు

తిరుపతి అర్బన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): స్థానిక కపిలేశ్వరస్వామి ఆలయంలో బుధవారం జరిగిన పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం యాగశాలపూజ, హోమం, మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, మూలవర్లకు కలశాభిషేకం, పట్టుపవిత్ర సమర్పణ చేపట్టారు. మధ్యాహ్నం అభిషేకం, అనంతరం అలంకరణ, సహస్రనామార్చన నిర్వహించారు. సాయంత్రం పంచమూర్తులైన వినాయకస్వామి, వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, కపిలేశ్వరస్వామి, కామాక్షి అమ్మవారు, చండికేశ్వరస్వామీలను ఊరేగించారు. పవిత్రోత్సవాల్లో పాల్గొన్న భక్తులకు పవిత్రమాల, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఖమ్మంలోని టీటీడీ భూముల్లో అన్యమతస్తుల నిర్మాణాలు

● అడ్డుకుంటామన్న తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు



రామచంద్రరావు, ఎంపీ సత్యనారాయణ, అంజిరెడ్డి

తిరుమల, జూలై9(ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో టీటీడీకి చెందిన భూములను వాణిజ్య అవసరాలకు అన్యమతస్తులకు ఇవ్వడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు చెప్పారు. ఎంపీ పాకా వెంకట సత్యనారాయణ, కరీంనగర్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డితో కలిసి బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఖమ్మంలో కొంతమంది నాయకుల ప్రమేయంతో టీటీడీ భూమిని అన్యమతస్తులు కబ్జా చేసి ఇళ్లు, దుకాణాల నిర్మించుకున్నట్టు తెలిసిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం అడ్డుకోవాలన్నారు. ఖమ్మంలోనే కాకుండా ఇతర ప్రాంతాల్లో ఉన్న టీటీడీ భూములను కూడా రక్షించే ప్రయత్నం తాము చేస్తామన్నారు.

ఎన్ని కుట్రలు చేసినా జనం తరలి వచ్చారు: భూమన

తిరుపతి(జీవకోన), జూలై 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్ బంగారుపాళ్యం పర్యటనకు అడుగడుగునా అవాంతరాలతో ఎన్ని కుట్రలు చేసినా జనం తరలివచ్చారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, మామిడి రైతుల్లో భరోసా నింపడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి వారికి మేలు చేయడానికి జగన్ వచ్చారన్నారు. బంగారుపాళ్యంలో పూర్తిగా పోలీసులు మోహరించి రైతులను, కార్యకర్తలను నిలువరించే ప్రయత్నం చేసినా ఎవరూ లెక్కచేయలేదన్నారు. ఈ సమావేశంలో మేయర్ డాక్టర్ శిరీష, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో మద్రాసు హైకోర్టు సీజే శ్రీరామ్



తిరుమల, జూలై9(ఆంధ్ర జ్యోతి): మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ శ్రీరామ్ బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

త్వరలో విజయ్ 'జననాయకుడు'



నిర్మాత ఎన్కే లోహిత్ - ఆశీష్‌రెడ్డి - అన్నామలై

● సినీ నిర్మాత ఎన్కే లోహిత్

తిరుమల, జూలై9(ఆంధ్రజ్యోతి): దళపతి విజయ్ నటిస్తున్న 'జననాయకుడు' సినిమాను త్వరలో విడుదల చేయనున్నట్టు ఆ చిత్ర నిర్మాత ఎన్కే లోహిత్ తెలిపారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం దర్శించుకున్న అయన మీడియాతో మాట్లాడారు. త్వరలో తెలుగులో ఓ భారీ చిత్రాన్ని తీయబోతున్నామని, నెలరోజుల్లో ఈ వివరాలను వెల్లడిస్తామని చెప్పారు. అలాగే, శ్రీవారిని తమిళనాడు రాష్ట్ర బీజేపీ నేత అన్నామలై, వ్యాసరాజ మఠాధిపతులు విశ్వప్రియ తీర్థ, ఈషాప్రియ తీర్థ, సినీ హీరో ఆశీష్‌రెడ్డి తదితరులు దర్శించుకున్నారు. 'దేత్తడి' చిత్రం షూటింగ్ త్వరలో ప్రారంభంకానుందని ఆశీష్‌రెడ్డి తెలిపారు.


సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.66 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,320

తలనీలాలు సమర్పించినవారు: 24,950



పట్టణాలకు మహర్దశ



అమృత్ 2.0 కింద నాలుగు జిల్లాలకు రూ.1622.63 కోట్లు

23 మున్సిపాలిటీల్లో ఇంటింటికి తాగునీరు

టెండర్లు ఆహ్వానించిన పబ్లిక్ హెల్త్ అధికారులు

నెల్లూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలకు మహర్దశ పట్టనుంది. కనీస మౌలిక వసతులైన తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ, నీటి వనరుల అభివృద్ధి వంటి పనులు చేసేందుకు భారీగా నిధులు మంజూరయ్యాయి. కేంద్ర ప్రభుత్వ పథకమైన అమృత్ 2.0 కింద రాష్ట్ర ప్రభుత్వం ఈ పనులు చేపడుతోంది. ఇటీవల ఈ స్థాయిలో మున్సిపాలిటీలకు నిధులు మంజూరవడం ఇదే ప్రథమం. పబ్లిక్ హెల్త్ విభాగం ఈ పనుల నిర్వహణ బాధ్యతలను చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీలకు అమృత్ 2.0 పథకం కింద రూ.10,251 కోట్లను మంజూరు చేయగా.. అందులో పబ్లిక్ హెల్త్ నెల్లూరు సర్కిల్‌కు రూ.1622.63 కోట్లను కేటాయించారు. ఈ సర్కిల్ పరిధిలో నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, చిత్తూరు జిల్లాలున్నాయి. ఈ నాలుగు జిల్లాల పరిధిలోని 23 అర్బన్ లోకల్ బాడీలకు (మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు) నిధులను విభజించారు. ఆయా మున్సిపాలిటీల్లో అవసరాలను బట్టి నిధులు కేటాయించారు. అమృత్ 2.0 పథకం కింద నిధులను మూడు విభాగాలకు ఖర్చు చేసేలా ప్రణాళిక రూపొందించుకున్నారు. అందులో తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ, నీటి వనరుల అభివృద్ధి ఉన్నాయి. ఈ దఫా ఇంటింటికీ తాగునీటిని కుళాయిల ద్వారా ఇవ్వాలన్నది ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసమే సింహభాగం నిధులను కేటాయించారు.

అమృత్ 2.0 కింద వివిధ మున్సిపాలిటీలకు మంజూరైన నిధుల వివరాలు...

మున్సిపాలిటీ	తాగునీటి సరఫరా (రూ.కోట్లు)	మురుగునీటి నిర్వహణ (రూ.కోట్లు)	నీటివనరుల అభివృద్ధి (రూ.కోట్లు)
గూడూరు	26.11	---	4.50
వెంకటగిరి	114.84	---	---
సూళ్లూరుపేట	1.47	----	5
నాయుడుపేట	3.50	----	1.18
చిత్తూరు	29.70	34.43	7.70
శ్రీకాళహస్తి	27.30	11.46	---
పుంగనూరు	14.35	----	----
పుత్తూరు	17.14	--	1.60
నగరి	17.93	---	2.20
పలమనేరు	15.81	---	2.20

రెండేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యం

ఈ నాలుగు జిల్లాల పరిధిలో రూ.1622.63 కోట్ల పనులకు పబ్లిక్ హెల్త్ అధికారులు టెండర్లు ఆహ్వానించారు. గత నెల 30న టెండర్ల ప్రక్రియ ప్రారంభం కాగా ఈనెల 28 వరకూ బిడ్ల దాఖలుకు అవకాశం కల్పించారు. 23 మున్సిపాలిటీల్లో 73 వర్కులుగా విభజించారు. వాటన్నింటినీ ఒకే ప్యాకేజీగా టెండర్లు పిలిచినట్లు పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మోహన్ 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. కాగా, టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ రెండేళ్లలో పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. నెల రోజులోపు కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ ప్రక్రియను పూర్తి చేసేందుకు పబ్లిక్ హెల్త్ అధికారులు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ఆ వెంటనే పనులు మొదలు పెట్టించేలా సన్నాహాలు చేస్తున్నారు.

మీరే వెళ్తారా.. మమ్మల్ని పంపమంటారా?

● టీటీడీలోని అన్యమత ఉద్యోగులకు భానుప్రకాష్‌రెడ్డి హెచ్చరిక

తిరుమల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): 'ఇతర దేవుళ్లను పూజించేవారు ఎవరైనా టీటీడీలో ఉంటే స్వచ్ఛందంగా వెళ్లిపోవాలి. లేకుంటే మేమే సాగనంపుతాం' అని టీటీడీ బోర్డు సభ్యుడు, బీజేపీ నాయకుడు భానుప్రకాష్‌రెడ్డి అన్యమత ఉద్యోగులను ఉద్దేశించి హెచ్చరించారు. తిరుమల శ్రీవారి ఆలయం ముందు ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ, ఏసును ప్రార్థించే వ్యక్తులు టీటీడీలో పనిచేయాల్సిన అవసరం లేదన్నారు. 'స్వామి జీతం తీసుకుంటున్న కొందరు ఉద్యోగులు స్వామి హారతి, ప్రసాదం తీసుకోరు. వారి పేర్లేమో రాముడు, కృష్ణుడు అని ఉంటాయి. కానీ ప్రార్థించేదేమో ఏసుని. ఆ దేవుడిపై ప్రేముంటే ఆ దేవుడి దగ్గరే ఉండండి. మా దేవుడి దగ్గరకు రాకండి' అని అన్నారు. టీటీడీలో పనిచేసే ప్రతి ఉద్యోగి ఇంట్లో టీటీడీ విజిలెన్స్ విభాగం ద్వారా తనిఖీలు చేయిస్తామని, వారి ఇళ్లలో హిందూ దేవుళ్ల చిత్రపటాలు కాకుండా అన్యమతానికి చెందిన చిత్రపటాలుంటే వారందరినీ ఉద్యోగం నుంచి తొలగించేలా రానున్న బోర్డులో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

జనసాంద్రత ఆధారంగా మౌలిక వసతులకు రూపకల్పన

● కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి సూచన



అధికారులతో సమీక్షిస్తున్న శ్రీనివాస్ కటికితల

తిరుపతి(కలెక్టరేట్), జూలై 9 (ఆంధ్రజ్యోతి): జనాభా అవసరాల ప్రాతిపదికన ప్రణాళికలు రూపొందించాలని.. జనసాంద్రత ఆధారంగా మౌలిక సదుపాయాల రూపకల్పన జరగాలని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆర్ శ్రీనివాస్ కటికితల సూచించారు. తిరుపతి నగర సమగ్రాభివృద్ధిపై బుధవారం రాత్రి కలెక్టరేట్‌లో ఆయన కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి పలుఅంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. 'నగరాల విస్తరణకు బదులుగా అందులోని ఖాళీ భూముల వినియోగంతో ఎక్కువమందికి సేవలు అందించేలా ప్రణాళికలు రూపొందించండి. ఇదే అభివృద్ధికి సమర్థమైన మార్గం. విస్తృత ఆర్థిక జోన్ అభివృద్ధి ద్వారా తిరుపతి ప్రాంతానికి కొత్త రూపురేఖలను తీసుకురావాలన్నదే లక్ష్యం. పర్యాటకాన్ని కేవలం దర్శనానికే పరిమితి చేయకుండా, రాత్రి వసతితో కూడిన ప్యాకేజీలుగా మార్చడం ద్వారా వ్యాపారాభివృద్ధికి దోహదపడుతుంది' అని వివరించారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పెట్టుబడులను ఉపయోగించి వృద్ధి అవకాశాలను అధికంగా పెంచేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. దీనికి విజయవాడలోని కాళేశ్వర్‌రావు.. హైదరాబాదులోని బేగంబజారు మార్కెట్లను ఉదాహరణగా ప్రస్తావించారు. తిరుమల శ్రీవారిని దృష్టిలో ఉంచుకుని తిరుపతిలో పెళ్లిళ్లకు ఇష్టపడతారని, ఈ క్రమంలో నగరాన్ని డెస్టినేషన్ వెడ్డింగ్ కేంద్రంగా తీర్చిదిద్దాలన్నారు. జిల్లా భౌగోళిక పరిస్థితులను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ కలెక్టర్ వెంకటేశ్వర్ వివరించారు. జిల్లాలో 25 లక్షల జనాభా ఉంటే, తిరుపతిలోనే 4.5 లక్షలు ఉన్నారన్నారు. పరిశ్రమలు, పెట్టుబడులపై వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గృహ నిర్మాణ పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి ఇషాకాలియా, సాంకేతిక సలహాదారు రోహిత్ కక్కర్, జేసీ శుభంబన్సల్, కమిషనర్ మౌర్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ దాడి గర్హనీయం

తిరుపతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జగన్ బంగారుపాళ్యం పర్యటన సందర్భంగా ఆంధ్రజ్యోతి చిత్తూరు ఫొటోగ్రాఫరు శివకుమార్‌పై వైసీపీ మూకల దాడిని జర్నలిస్టు సంఘాలు ఖండించాయి. చొక్కా చింపేసి విచక్షణారహితంగా కొట్టడం దారుణమని ఏపీయూడబ్ల్యూజే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసాద్ రెడ్డి, పి.నరేంద్ర మండిపడ్డారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. ఈ దాడిని తిరుపతి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మురళి, ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు కాళహస్తి గిరిబాబు ఖండించారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీమూకలను అరెస్టు చేయకపోతే ఉద్యమించాల్సి వస్తుందని ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాధాకృష్ణ, లావణ్యకుమార్ హెచ్చరించారు. మీడియా ప్రతినిధులను పార్టీలకతీతంగా చూడాలని, దురుద్దేశంతో దాడులకు పాల్పడడం అనైతిక చర్య అని ఏపీఎంఎఫ్ నాయకులు కల్లుపల్లి సురేంద్రరెడ్డి, డిల్లీబాబురెడ్డి పేర్కొన్నారు.

10 కిలోల గంజాయి స్వాధీనం

●ఆరుగురి అరెస్టు

సూళ్లూరుపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో బుధవారం ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మనాయుడు తెలిపిన ప్రకారం.. చెంగాళమ్మ ఆలయ సమీపంలోని వాటంబేడు రోడ్డులో అనుమానంగా తిరుగుతున్న కంపా చంద్రకాంత్(సూళ్లూరుపేట), అంకల భరత్ కౌశల్(విజయవాడ), బూరగ తేజ(తడ మండలం వెండ్లూరుపాడు), మండెం శైలేష్(సూళ్లూరు), పరింగి నరేంద్ర (తడ మండలం అనపగుంట), వేనాటి శ్రీహరి (నాగరాజపురం)లను పట్టుకుని పోలీసులు విచారించారు. వారి వద్ద 10 కిలోల గంజాయితోపాటు మోటారు సైకిల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. వీరిని పట్టుకునేందుకు సహకరించిన ఏఎస్ఐ శ్రీకుమార్ రెడ్డి, సిబ్బంది గిరీష్‌కుమార్, సురేష్, విజయ్‌ను డీఎస్పీ అభినందించారు.

13న ఐఐటీలో ఇంక్యుబేషన్ కేంద్రం ప్రారంభం

ఏర్పేడు,జూలై9(ఆంధ్రజ్యోతి): ఆహార ప్రాసెసింగ్ రంగంలో యువ ఔత్సాహికులకు వేదికగా సామూహిక ఇంక్యుబేషన్ కేంద్రాన్ని తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో ఈనెల 13న ప్రారంభించనున్నారు. కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ ముఖ్యఅతిథిగా హాజరై కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ కూడా హాజరు కానున్నారు.

వెంకటగిరి నేతన్నకు జాతీయ పురస్కారం



మగ్గం నేస్తున్న శ్రీనివాసులు


వెంకటగిరి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి బొప్పాపురం సాలికాలనీకి చెందిన లక్కా శ్రీనివాసులు 'సంత్ కబీర్ జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి ఆర్.రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈయన స్వహస్తాలతో చీరపై నేసిన లక్ష్మీవృక్షం డిజైన్ జాతీయ స్థాయి గుర్తింపు సాధించిందన్నారు. ఏటా కేంద్ర వస్త్ర మంత్రిత్వ శాఖ 15వ శతాబ్దపు ఆధ్యాత్మిక కవి సంత్ కబీర్ పేరిట ఈ పురస్కారాన్ని అందజేస్తోంది. ఈ ఏడాది వెంకటగిరి నేతన్నకు ఈ అవార్డు దక్కడం విశేషం. ఆగస్టు 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని శ్రీనివాసులు అందుకోనున్నారు.

విజిలెన్స్ డీఎస్పీ అంటూ వీఆర్వో ఇంట్లో తనిఖీలు

● నకిలీ అధికారులకు రూ.1.20 లక్షలు సమర్పించిన వీఆర్వో

రేణిగుంట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ డీఎస్పీ అంటూ ఓ వీఆర్వో ఇంట్లో తనిఖీల పేరిట బెదిరించి రూ. 1.20లక్షలు తీసుకున్న విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీస్‌స్టేషన్ సమీపంలోని జీవాగ్రంలో నివాసం ఉంటున్న భూపతి.. వడమాలపేట మండలం ఎస్వీపురంలో వీఆర్వో. గతంలో ఆయన రేణిగుంట, తిరుపతి రూరల్, అర్బన్ పరిధిలో వీఆర్వోగా పనిచేశారు. గత నెల 26న ఈయన ఇంటికి విజిలెన్స్ డీఎస్పీ, కానిస్టేబుళ్లు అంటూ నలుగురు వచ్చారు. గతంలో పనిచేసిన ప్రాంతాల్లో అక్రమాలకు పాల్పడి భారీ ఎత్తున ఆస్తులు కూడబెట్టావని, ఆ నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తే నీ ఉద్యోగం పోతుందంటూ బెదిరించారు. ఆందోళనకు గురైన భూపతి వారికి రూ.1.20 లక్షలు ఇచ్చారు. ఇది చాలదని, కొంత సమయం తీసుకుని మరింత నగదు ఇవ్వాలని చెప్పి వెళ్లిపోయారు. వారం తర్వాత నగదు ఇవ్వాలని ఫోన్ చేసి ఒత్తిడి చేయగా, ఆయన తన స్నేహితులకు చెప్పారు. వారి సూచన మేరకు నాలుగు రోజుల క్రితం గాజులమండ్యం పోలీసులకు భూపతి ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వీఆర్వో ఇంట్లోని సీసీకెమెరా ఫుటేజీని పరిశీలించారు. నలుగురిని నకిలీ అధికారులుగా గుర్తించారు. భూపతికి చేసిన ఫోన్ నెంబర్ల ఆధారంగా లొకేషన్ ట్రేస్ చేశారు. వారు కర్నూలు, అనంతపురానికి చెందిన వారని పోలీసులు అనుమానిస్తున్నారు.

మరో మైలు రాయిని అధిగమించిన శ్రీసిటీ - వీఆర్వీ పరిశ్రమ



వీఆర్వీ పరిశ్రమ సరఫరా చేస్తున్న భారీ క్రయోజనిక్ ట్యాంకు

● ఖతార్ ఎయిర్ లిక్విడ్ సంస్థకు ఉత్పత్తుల ఎగుమతి

శ్రీసిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని క్రయోజనిక్ ట్యాంకుల తయారీ అగ్రగామి సంస్థ యూఎస్ఏ చార్ట్ ఇండస్ట్రీస్‌కు చెందిన వీఆర్వీ ఆసియా పసిఫిక్ ప్రైవేట్ లిమిటెడ్ మరో మైలురాయిని అధిగమించింది. ఎయిర్ లిక్విడ్ తయారీలో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఖతార్‌లోని ఎయిర్ లిక్విడ్ సంస్థకు అధిక సామర్థ్యం కలిగిన (సూపర్ సైజ్) లిక్విడ్ నైట్రోజన్ స్టోరేజ్ ట్యాంకును ఎగుమతి చేసింది. ప్రస్తుతం ఎగుమతి చేసిన క్రయోజనిక్ ట్యాంక్ 47 మీటర్ల పొడవు, 6 మీటర్ల వ్యాసం, 214 టన్నుల బరువు కలిగి ఉండడం విశేషం. మంగళవారం ఉదయం 192 చక్రాల మల్టీ యాక్సిల్ వాహనం ద్వారా ఈ ట్యాంకును కృష్ణపట్నం పోర్టుకు తరలించారు. ఈ సరఫరా ద్వారా అంతరిక్ష రంగం అవసరాలకు అనుగుణంగా భారీ క్రయోజనిక్ ఇంధన నిల్వ ట్యాంకుల తయారీలో ప్రపంచ వ్యాప్తంగా మరింత గుర్తింపును వీఆర్వీ పరిశ్రమ దక్కించుకుంది. కాగా దేశంలో దాదాపు 17 సంవత్సరాలుగా నాణ్యత, నూతన ఆవిష్కరణలతో ప్రసిద్ధి చెందుతున్న వీఆర్వీ సంస్థ అమెరికాలోని ఒక ప్రైవేట్ ఏరోస్పేస్ సంస్థతో పాటు భారత్‌లోని ఇస్రోకు విశ్వసనీయ భాగస్వామిగా మారింది. కోవిడ్ సంక్షోభ సమయంలో దేశవ్యాప్తంగా ఆక్సిజన్ సిలిండర్లు, నిల్వ ట్యాంకులను వీఆర్వీ సరఫరా చేసింది. శ్రీసిటీ విరాళంగా తిరుపతి స్విమ్స్, బర్డ్, రుయా ఆస్పత్రులతో పాటు తిరుపతి, నెల్లూరు జిల్లాలలోని ప్రభుత్వ ఆస్పత్రులకు అందజేసిన ఆక్సిజన్ నిల్వ ట్యాంకులను వీఆర్వీ సకాలంలో సరఫరా చేసి కీలక పాత్ర పోషించింది. కాగా మైలురాయిని అధిగమించిన వీఆర్వీ పరిశ్రమ యాజమాన్యానికి, ఉద్యోగులకు శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశాంతంగా సార్వత్రిక సమ్మె



నల్లగొడుగులు, నల్లదుస్తులతో నిరసన - సభలో ప్రసంగిస్తున్న సీపీఐ నేత నారాయణ

తిరుపతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలనే డిమాండ్‌తో వామపక్షాలు, కార్మిక సంఘాలు బుధవారం జిల్లాలో చేపట్టిన సార్వత్రిక సమ్మె ప్రశాంతంగా జరిగింది. ప్రజా జీవితానికి ఎలాంటి ఇబ్బందీ, అసౌకర్యం కలగని రీతిలో సీపీఐ, సీపీఎం పార్టీల అనుబంధ కార్మిక సంఘాలు సమ్మెలో పాల్గొన్నాయి. తిరుపతిలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో అనుబంధ కార్మిక సంఘాలు జోరుగా ర్యాలీలు నిర్వహించాయి. మానవహారంగా నిలబడ్డారు. అందరూ నాలుగు కాళ్ల మండపానికి చేరుకోగా.. సంయుక్తంగా బహిరంగసభ నిర్వహించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, ఐఎఫ్‌టీయూ నేత వెంకటరత్నం తదితరులు ప్రసంగిస్తూ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కార్మికుల పని వేళలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. పుత్తూరులో ఎల్ఐసీ ఉద్యోగులు కార్యాలయం మూసివేసి ఆందోళనకు దిగారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, వామపక్షాల కార్యకర్తలతో కలసి బ్యాంకులను మూయించారు. ఇలా పలు చోట్ల ర్యాలీలు, మానవహారాలతో నిరసన తెలిపారు.

కేసు వాదించడానికి వెళ్లి..!

● తిరిగొస్తుండగా ప్రమాదం ● ఇద్దరు న్యాయవాదుల దుర్మరణం

● వీరిలో ఒకరు తిరుపతివాసి



సుబ్రహ్మణ్యం యాదవ్, రాజగోపాల్ (ఫైల్‌ఫొటోలు)

తిరుపతి(నేరవిభాగం)/రాజంపేట టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఓ కేసు వాదించడానికి రాజంపేట వెళ్లి తిరిగొస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరుపతి, పీలేరుకు చెందిన న్యాయవాదులు సుబ్రహ్మణ్యంయాదవ్(70), నూలివేటి రాజగోపాల్(63) దుర్మరణం చెందారు. వివరాలిలా ఉన్నాయి. న్యాయవాది సుబ్రహ్మణ్యంయాదవ్ తిరుపతిలోని డీబీఆర్ ఆస్పత్రి రోడ్డులో కాపురం ఉంటున్నాడు. తిరుపతికి చెందిన కుమారస్వామి కేసు వాదించడానికి ఫిర్యాదుదారుడితో పాటు స్నేహితుడు పీలేరుకు చెందిన న్యాయవాది రాజగోపాల్‌తో కలిసి బుధవారం ఉదయం కారులో రాజంపేటకు వెళ్లారు. అక్కడ మధ్యాహ్నం 12.30గంటల వరకు కోర్టులో ఉన్నారు. ఆ తర్వాత తిరుపతికి తిరుగు ప్రయాణంలో రాజంపేట శివారు ప్రాంతంలోని అశోక గార్డెన్ సమీపానికి వచ్చారు. అదే సమయంలో రాయచూరుకు చెందిన వంగాల వెంకటేశ్వర్‌రెడ్డి, విజయవర్ధన్‌రెడ్డి, శైలజ, హాసిని, శంకరమ్మ తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో అక్కడికి చేరుకున్నారు. ఆ క్రమంలో వీరి కారు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న న్యాయవాదుల కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు న్యాయవాదులు అక్కడికక్కడే మృతిచెందగా కుమారస్వామితో పాటు మరో కారులోని ఐదుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ఆసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదానికి సంబంధించి రాజంపేట మన్నూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, సుబ్రహ్మణ్యం యాదవ్‌కు ముగ్గురు పిల్లలు. ప్రవీణ్‌కృష్ణ దివ్యాంగుడు కాగా, వంశీకృష్ణ తిరుపతిలోని రాయలనగర్‌లో డెంటల్ ఆస్పత్రి నిర్వహిస్తున్నారు. కుమార్తె గాయత్రి చంద్రకళ. ఈయన మృతిపట్ల తిరుపతి న్యాయవాదులసంఘం అధ్యక్షుడు గుట్టు గజేంద్ర, న్యాయవాదులు సంతాపం వ్యక్తం చేశారు.

ప్రతి గ్రామానికీ మౌలిక వసతులు

● అక్రమ లేఅవుట్లు, అనధికార నిర్మాణాలను పంచాయతీ కార్యదర్శులు గుర్తించాలి

● తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి

తిరుపతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తుడా పరిధిలోని అన్ని గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, డ్రైన్లు, కరెంటు సౌకర్యం కల్పించడానికి కృషి చేస్తామని తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి తెలిపారు. తుడా పరిధిలో లేఅవుట్ అప్రూవల్, భవన నిర్మాణాల అనుమతులు, అమలు తదితర అంశాలపై 39 మంది ఎంపీడీవోలు, 1100కు పైగా గ్రామపంచాయతీల కార్యదర్శులకు బుధవారం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గత పాలకులు తుడాను భ్రష్టు పట్టించగా.. తాను గాడిలో పెడుతున్నానని తెలిపారు. అక్రమ లేఅవుట్లతో క్రైమ్ రేటు పెరుగుతోందని, ప్రజలు అక్రమ లేఅవుట్లలో స్థలాలు కొని ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులు లేఅవుట్, భవన నిర్మాణాల అనుమతులు వాటి అమలు, తుడా నిబంధనలు తెలుసుకోవాలని కోరారు. అక్రమ లేఅవుట్లు, అనధికార నిర్మాణాలను గుర్తించాలని సూచించారు. గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమైనదని ప్రభుత్వ జీవోలను క్షుణ్ణంగా తెలుసుకుని వాటిని అమలు చేయాలని తుడా వైస్ ఛైర్మన్ శుభం బన్సల్ కోరారు. తుడాకు, పంచాయతీ కార్యదర్శుల మధ్య ఉన్న సమాచారలోపాన్ని పూరిస్తామన్నారు. అక్రమ లేఅవుట్లు ఎలా గుర్తించాలి? భవన నిర్మాణాల అనుమతులు తదితర అంశాలను తుడా సిటీ ప్లానింగ్ ఆఫీసర్ దేవీ కుమారి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశీ, డీపీవో సుశీలాదేవి, డీపీవో సురేష్ నాయుడు, మున్సిపల్ డిప్యూటీ సిటీ ప్లానర్ మహబూబ్ ఖాన్, తుడా సెక్రటరీ శ్రీకాంత్ తదితరులు హాజరయ్యారు.



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తుడా ఛైర్మన్, జేసీ

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

పేదల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


అభివృద్ధి పనుల ప్రారంభ శిలాఫలకం వద్ద పాశం

గూడూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పేదలకు సంక్షేమ పథకాలను అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం విందూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఏడాది పాలనలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలను, నెరవేర్చిన హామీలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, దీపం వంటి హామీలను నెరవేర్చిందన్నారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, నిరుద్యోగభృతి వంటి హామీలను నెరవేర్చుతుందన్నారు. గ్రామంలో రూ.10లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును, రూ.5 లక్షలతో నిర్మించిన శ్మశానవాటిక ప్రహరీని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, మల్లికార్జున్‌రెడ్డి, పెంచలరెడ్డి, కార్తీక్‌రెడ్డి, మట్టం శ్రావణి, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్ల రద్దు కోరుతూ కార్మిక సంఘాల ధర్నా



గూడూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కొత్త లేబర్‌కోడ్ రద్దు చేసి కార్మికుల హక్కులను కాపాడాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. బుధవారం స్థానిక వివేకానంద రోడ్డులోని నీళ్లట్యాంకు ప్రాంతం నుంచి టవర్‌క్లాక్ సెంటర్ వరకు సీఐటీయూ, ఏఐటీయూసీ తదితర కార్మిక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. టవర్‌క్లాక్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్, అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు తదితర అనుబంధ కార్మికసంఘాలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఉన్న 29 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో కార్మికనాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, పుల్లయ్య, శివకుమార్, ప్రభాకర్, శశికుమార్, బీవీరమణయ్య, మణి, శంకరయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



గూడూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక టవర్‌క్లాక్ కేంద్రం వద్ద బుధవారం మెప్మా రిసోర్స్ పర్సన్‌ల ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చిత్రపటాలకు పాలతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆర్పీలు మాట్లాడుతూ రిసోర్స్‌పర్సన్‌లకు మూడు సంవత్సరాల ఉద్యోగ పరిమితిని రద్దుచేస్తూ ఉద్యోగ భద్రత కల్పించిన సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఎమ్మెల్యే నివాసం వద్ద ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చేతుల మీదుగా రిసోర్స్‌పర్సన్‌లకు ట్యాబ్‌లను అందజేశారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, పెంచలయ్య, చందన, ఉషా, లక్ష్మీ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన గురుకుల కళాశాల ప్రిన్సిపాల్

డక్కిలి, జులై 9 (ఆంధ్రజ్యోతి) : డక్కిలి బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత బుధవారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు ఇటీవల ఆమె శ్రీకాళహస్తి గురుకుల కళాశాల నుంచి బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. విద్యార్థులకు మంచి భోజనం అందించడంతోపాటు ఉత్తమ ఫలితాలు వచ్చేలా చూడాలని ఎమ్మెల్యే రామకృష్ణ ఆమెకు సూచించారు.

సమాచార హక్కు చట్టంతో సమగ్ర సమాచారం



అవగాహన కల్పిస్తున్న ఉరుకుందమ్మ

నాయుడుపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కుచట్టం ద్వారా ప్రతి అధికార యంత్రాంగంలో పారదర్శకంగా సమగ్ర సమాచారం అందుతుందని మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ అన్నారు. నాయుడుపేట అంబేడ్కర్ భవన్‌లో బుధవారం సచివాలయ సిబ్బందికి, మెప్మా, పొదుపు మహిళలకు సమాచార హక్కుచట్టంపై అవగాహన కల్పించారు. ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజలకు సమాచార చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. అధికారయంత్రాంగం సవ్యంగా పనిచేయాలన్నా, అవినీతిని అరికట్టాలన్నా ఈ చట్టం ఎంతో ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ పాలనా కార్యదర్శులు లోకేశ్వరి, దయాశేఖర్, వెల్ఫేర్ కార్యదర్శి కిషోర్, వివిధశాఖల కార్యదర్శులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో పారదర్శకంగా సవరణలు

నాయుడుపేట, జూ లై 9(ఆంధ్రజ్యోతి) :ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు పారదర్శకంగా ఉండాలని తహసీల్దారు ఎం. రాజేంద్ర సూచించారు. నాయుడుపేట తహసీల్దారు కార్యాలయంలో బుధవారం బీఎల్‌వోల సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్‌ల వారీగా 18 సంవత్సరాలు నిండిన వారిని గుర్తించి ఓటు హక్కు కల్పించాలన్నారు. బదిలీలలో, వలస వచ్చిన ఓటర్లను గుర్తించి జాబితాలో చేర్చాలన్నారు. స్థానికంగా లేనివారిని గుర్తించి వారిని ఓటర్ల జాబితాలో తొలగించాలన్నారు.

ప్రసన్నకుమార్‌రెడ్డిని అరెస్ట్ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న తెలుగుమహిళ నేతలు

గూడూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని తిరుపతి పార్లమెంటు తెలుగుమహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి కోరారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ తెలుగుమహిళల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు మంచి పద్ధతికాదన్నారు. కార్యక్రమంలో గుండాల లీలావతి, శ్యామల, కల్పన, సుబ్బమ్మ, విజయమ్మ, అంకమ్మ తదితరులు పాల్గొన్నారు. **పెళ్లకూరు:** ప్రసన్నకుమార్‌రెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని నాయుడుపేట ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ పునబాక పోలయ్య డిమాండ్ చేశారు. టీడీపీ నాయకులు గంగాబత్తిన రామకృష్ణ, భాస్కర్, రవి, భాస్కర్, శివ ఉన్నారు.

అనుచిత వ్యాఖ్యలు తగదు: ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కోరారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ నాయకులు, నేతలు, ప్రజా ప్రతినిధులకు మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం పరిపాటిగా మారిపోయిందన్నారు. ప్రజాదరణ కలిగి నిత్య ప్రజాక్షేత్రంలో ఉండే ప్రశాంతిరెడ్డికి సంబంధించి ఇష్టానుసారం మాట్లాడడం తగదన్నారు. ఆ పార్టీ అధినేత ఖండించకపోవడం దుర్మార్గమన్నారు. తల్లిని, చెల్లిని బజారు వీధుల్లోకి లాగిన జగన్మోహన్ రెడ్డి మహిళా ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసిన విషయాన్ని ఖండించకపోవడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



గూడూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆసుపత్రిలో బుధవారం జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా మాట్లాడుతూ ప్రతినెల క్రమం తప్పకుండా జేవీవీ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలలో వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచునారాయణ, పురుషోత్తమరావు, సుబ్బారావు, రజనీకాంత్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

గూడూరు అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంతోపాటు వారిలో దేశభక్తిని పెంపొందించేందుకు ఏబీవీపీ కృషిచేస్తుందని నాయకులు అన్నారు. బుధవారం ఓ ప్రైవేటు పాఠశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మల్లికార్జున, మనోజ్‌కుమార్, శ్రీకాంత్, మనోహర్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి అభినందనలు


మాధవ్‌కిఅభినందనలు తెలుపుతున్న కిషన్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి

సూళ్లూరుపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన పీవీఎన్ మాధవ్‌ను విజయవాడలో బుధవారం జిల్లా యువమోర్చ అధ్యక్షుడు ఆరణి కిషన్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఆయనతో పాటు యువమోర్చ కార్యదర్శి కిరణ్‌రెడ్డి కూడా ఉన్నారు.

భూముల కన్వర్షన్‌పై పరిశీలన


రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

కోట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : వెంకన్నపాళెం, వీరారెడ్డి సత్రం గ్రామాల సమీపంలోని భూములను సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా బుధవారం పరిశీలించారు. ఇక్కడ ఉన్న 3.20 ఎకరాలను వ్యవసాయేతర భూములుగా మార్చుకునేందుకు చిట్టమూరు మండలం మల్లాం గ్రామానికి చెందిన దువ్వూరు సుజాతమ్మ సబ్ కలెక్టర్‌ను కోరారు. ఈ క్రమంలోనే సబ్ కలెక్టర్‌తోపాటు తహసీల్దారు జయజయరావు, ఆర్‌ఐ ప్రసాద్, వీఆర్వో కృష్ణయ్యలు ఆ భూములకు సంబంధించి కన్వర్షన్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు పరిశీలించారు.

తెలుగు యువత నేతకు అభినందన



కోట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : తెలుగుయువత మండల అధ్యక్షుడుగా ఎన్నికైన చల్లా సురేష్‌గౌడ్‌ను బుధవారం గోవిందపల్లి, వావిళ్ల దొరువు, కొత్తపట్నం, గున్నంపడియా, శ్రీనివాససత్రం, యమదిన్నెపాళెం గ్రామాలకు చెందిన యువత పూలమాలలు, శాలువాలతో అభినందించారు. కేక్‌కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీయుసీ అధ్యక్షుడు వాటంబేటి చెంగల్‌రావు, ఇంగిలాల రామమోహన్, ఆవుల వెంకటరమణయ్య, రాజా, నన్నేసాహెబ్, శ్రీనివాసులు, మురళీ, మస్తానయ్యల ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి.

గిరిజన కాలనీలో
గూడు కట్టుకున్న సమస్యలు


మరమ్మతులకు గురైన బోరు


గిరిజనకాలనీలోని ఈ మట్టిరోడ్డులో వర్షమొస్తే ఎన్ని ఇబ్బందులో..


శిథిలావస్థలో పక్కాగృహాలు

గూడూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి కూతవేటు దూరంలోని మధురెడ్డి గిరిజనకాలనీలో ప్రాథమిక వసతులు లేక ఇక్కడి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గూడూరు నుంచి వేములపాళెం వెళ్లే మార్గంలో ఈ గిరిజనకాలనీ ఉంది. కాలనీలో 43 కుటుంబాలు ఉంటున్నాయి. అందరివీ రెక్కాడితే గాని డొక్కాడని బతుకులే. రోజూ కూలిపనులు చేసుకుంటారు. కాలనీలోని రెండు వీధుల్లోనూ ఇప్పటికీ మట్టిరోడ్లే ఆధారం. సీసీరోడ్లు నిర్మించాలని చాన్నాళ్లుగా కోరుతున్నారు. ప్రభుత్వం గతంలో పక్కాగృహాలు నిర్మించింది. ప్రస్తుతం ఇవి కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షమొస్తే నివాసాలు ఉరుస్తున్నాయి. కొన్ని గృహాలు కనీసం నివాస యోగ్యం కూడా లేవు.

ఉపయోగపడని బోర్లు

రెండు ఉప్పునీటి బోర్లు నిరుపయోగంగా మారాయి. తాగునీటి కొళాయిల ద్వారా సరఫరాకు అంతరాయం కలిగితే దూరప్రాంతాలకు వెళ్లి తెచ్చుకోవాల్సివస్తుందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. మట్టి రోడ్లతో యాతన పడుతున్నామని, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తమ కాలనీపై దృష్టి సారించాలని గిరిజనులు కోరుతున్నారు.

వరికి ఊపిరి పోసిన తెలుగుగంగ జలాలు



కాపుకండ్రిగ తెలుగుగంగ కాలువ నుంచి విడుదలైన నీరు- పొట్టదశలో వరి

తడ, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : తెలుగు గంగ నీళ్లతో చెరువులు కళకళలాడుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో మాంబట్టు, వెండ్లూరుపాడు, కాదలూరు పరిధిలో వరి సాగు చేస్తుంటారు. ఈ ఏడాది విపరీతమైన ఎండలు నేపథ్యంలో చెరువులు అడుగంటాయి. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ స్పందించి తెలుగుగంగ అధికారులతో మాట్లాడారు. తెలుగుగంగ నీరు విడుదల చేయాలని కోరారు. అధికారులు సత్యవేడు మండలం కాపుకండ్రిగ వద్ద తెలుగుగంగ నుంచి కాలువల ద్వారా నీరు విడుదల చేశారు. 22 కిలోమీటర్ల నుంచి ఈ నీరు ప్రవహిస్తూ మాంబట్టు పెద్దచెరువు, వెండ్లూరుపాడు చెరువు అటు నుంచి కాదలూరు చెరువులకు చేరింది. దీంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతుంది. ఈ మూడు పంచాయతీల్లో సుమారు 1500 ఎకరాలలోని వరిని ఈ జలాలు ఆదుకుంటున్నాయని, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి తెలుగుగంగ అధికారులకు మాజీ సర్పంచ్ వేనాటి రాజారెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

దశల వారీగా సమస్యలకు పరిష్కారం:విజయశ్రీ


మహిళలకు కరపత్రం అందజేస్తున్న విజయశ్రీ

దొరవారిసత్రం, జూలై 9(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల హామీ మేరకు రాష్ట్రంలో ఆగస్టు 15 నుండి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత రవాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం వేణుంబాక, పాలెంపాడు, నెలబల్లి గ్రామాల్లో ఆమె పార్టీ నాయకులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలో సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. వేణుంబాక రోడ్డుకు నిధుల మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారంతో కూడిన కరపత్రాలను ఇళ్ళకు వెళ్ళి అందజేశారు. మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులునాయుడు, నాయకులు పామంజి శ్రీనివాసులు, శ్రీహరిరెడ్డి, రత్నయ్య, మురళిరెడ్డి, షబ్బీర్, జాన్‌రమేష్, నల్లారెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పాలెంపాడు గ్రామానికి చెందిన బీపీ నాయకుడు రమణయ్య యాదవ్ మండల పార్టీ అధ్యక్షుడిపై మండిపడ్డారు. ఎమ్మెల్యే జోక్యం చేసుకుని సర్దుబాటు చేశారు.

అధికారులు హాజరు కాకపోతే చర్యలు తప్పవు

● మండల మీట్‌లో తహసీల్దారు హెచ్చరిక



మాట్లాడుతున్న సీడీపీవో మునికుమారి

కోట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండల సమావేశానికి అధికారులు హాజరుకాకపోతే చర్యలు తప్పవని తహసీల్దారు కటారి జయజయరావు హెచ్చరించారు. బుధవారం మండల పరిషత్ అధ్యక్షురాలు దాసరి అంజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. పలుశాఖల అధికారులు హాజరు కాలేదు. దీంతో తహసీల్దారు మాట్లాడుతూ సోమవారం గ్రీవెన్స్, నెలాఖరులో సివిల్ రైట్స్‌డే కార్యక్రమాలకు కూడా కొంత మంది హాజరుకావడం లేదన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే నోటీసులు ఇచ్చి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి శాఖాపరమైన చర్యలకు సిఫారసు చేస్తామన్నారు. నెల్లూరుపల్లిలో అంగన్‌వాడీ కేంద్రానికి కొత్త భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు ఎంపీటీసీ వేనాటి నారాయణకు సీడీపీవో మునికుమారి తెలిపారు. ఎంపీటీసీలు సురేష్, షంషుద్దీన్‌లు పలు సమస్యలు ప్రస్తావించారు. ప్రజాప్రతినిధులు తగినంత మంది రాక సమావేశం సాదాసీదాగా జరిగింది. జడ్పీటీసీ కోటయ్య, రెండవ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు శేషయ్య, ఎంపీడీవో దిలీప్‌కుమార్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

చిల్లకూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణ సమీపంలోని కాశీలేవుట్‌లో అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం ఉదయం పలు అభిషేకాలు చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రికి భజన చేశారు. .

దాతలు స్పందించాలని దంపతుల వేడుకోలు


వెంకటేశ్వర్లు, లక్ష్మమ్మ

గూడూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): దాతలు స్పందించి ఆదుకోవాలని పోటుపాళెం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, లక్ష్మమ్మ దంపతులు కోరుతున్నారు. రెండేళ్ల క్రితం తమ కుమారుడు పవన్ పంబలేరు వాగులో వరద ప్రవాహం వల్ల మృతి చెందాడన్నారు. తాము కిడ్నీవ్యాధితో డయాలసిస్ చేసుకుంటూ ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ పోషణ కష్టతరంగా మారిందన్నారు. దాతలు స్పందించి తమ చికిత్సకు సాయమందించాలని కోరుతున్నారు.

పాఠశాల సమీపాన పొగాకు ఉత్పత్తులు విక్రయించొద్దు


దుకాణంలో పోలీసుల తనిఖీ

డక్కిలి, జులై 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, దేవాలయాలకు 200 మీటర్ల లోపు పొగాకు ఉత్పత్తుల విక్రయాలను ప్రభుత్వం నిషేధించిందని ఎస్‌ఐ శివశంకర్ తెలిపారు. ఈ నిబంధనలు ఉల్లంఘించి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. బుధవారం డక్కిలి, డి.వడ్డిపల్లి హైస్కూళ్ల పరిసరాల్లోని దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. కొన్ని సిగరెట్లను గుర్తించి మరో సారి విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

అంగన్వాడీల నిరసన

కోట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు బుధవారం మండల తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లపై తహసీల్దారు జయజయరావుకు అంగన్‌వాడీ అసోసియేషన్ అధ్యక్షురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో కార్మికులు వినతిపత్రం అందజేశారు.

సార్వత్రిక సమ్మెలో కదం తొక్కిన కార్మికులు




నాయుడుపేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద - సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండు సమీపాన కార్మికుల నిరసన

నాయుడుపేట టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని సీఐటీయు జిల్లా నాయకురాలు లక్ష్మీ కోరారు. నాయుడుపేటలో సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం సీఐటీయూ, అనుబంధ సంస్థలు ర్యాలీ నిర్వహించాయి. అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారంగా నిలిచారు. సీఐటీయు నాయకులు శివకవి ముకుంద, మహేష్ బాబులు మాట్లాడుతూ కార్మిక చట్టాల అమలును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్యామలమ్మ, సుజాత, మునెమ్మ, విజయమ్మ, వనమ్మ, రమణయ్య, మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **సూళ్లూరుపేట:** సూళ్లూరుపేటలో సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికుల నిరసన ర్యాలీ చేశారు. వినాయకుడిగుడి సెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ చేశారు. బస్టాండు సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. కార్మిక నాయకులు నాగరాజు లక్ష్మయ్య, చంద్రశేఖర్, అల్లెయ్య, నాగేంద్ర, ఎస్కే రియాజ్, సాంబశివయ్య, సుధాకర్ రెడ్డి, హైమావతి తదితరులు పాల్గొన్నారు. **బాలాయపల్లి:** మండలంలోని అంగన్‌వాడీలు కేంద్రాలను మూతవేసి సమ్మెలో పాల్గొన్నారు. బాలాయపల్లిలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. అంగనవాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి స్వరూపారాణి, బేబిరాణి, సుమతి, నవమణి, సుజాత, మమత, వరలక్ష్మి పాల్గొన్నారు. **డక్కిలి:** తమకు వేతనాలు పెంచి, ముఖహాజరును ప్రభుత్వం వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ సిఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. తహసీల్దార్ ఎం శ్రీనివాసుల కలిసి వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ప్రసన్న, వెంకటమ్మ, సుకన్య, తులసి, లీలా, సుగుణ, తదితరులు పాల్గొన్నారు. **వాకాడు:** సార్వత్రిక సమ్మెలో భాగంగా అంగన్‌వాడీ హెల్పర్ అండ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు పద్మలీల బుధవారం డిప్యూటీ తహసీల్దారు సందీప్‌కు వినతిపత్రం అందజేశారు. సహకారబ్యాంక్ వద్ద ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు.

వెంకటగిరి: పట్టణంలోని విశ్వోదయ కళాశాల క్రీడా ప్రాంగణం నుంచి కార్మికులు ప్రదర్శనగా బయలు దేరి మండల పరిషత్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, రైతు కూలీ సంఘం, సిఐటియు తదితర సంఘాలు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

వెంకటగిరిటౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఏపీ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ వినియోగదారుల కోసం గురువారం వెంకటగిరి పాలకేంద్రం వద్ద 132 కేవీ సబ్‌స్టేషన్ ఆవరణలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనుంది. ఏడీఈఈ మునిరవిచంద్ర బుధవారం ఈమేరకు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఛైర్‌పర్సన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి(రిటైర్డ్ జడ్జి), ఆర్థిక సభ్యుడు మధుకుమార్, స్వతంత్ర సభ్యుడు డబ్బ్యూ. విజయలక్ష్మీలు పాల్గొంటారని వివరించారు. వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల వినియోగ దారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థినికి క్రీడాపరికరాల అందజేత

సూళ్లూరుపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన తడ జడ్పీ ఉన్నత పాఠశాలకు విద్యార్థిని గుర్రపు తేజశ్రీని బుధవారం సూళ్లూరుపేట ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వాహకులు చంద్రబాబు అభినందించారు. బ్యాడ్మింటన్ క్రీడా సామగ్రిని అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు సురేష్, పీఈటీ సునీత పాల్గొన్నారు.

దాడి కేసులో ఒకరి అరెస్టు

నాయుడుపేట టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : దాడి కేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ఆదిలక్ష్మి తెలిపారు. ఈ నెల 2వ తేదీ రాత్రి అగ్రహారపేటలో ఉంటున్న మహేశ్వరిపై ఆమె అల్లుడు రవీంద్రనాథ్ దాడి చేసి గాయపరిచి హత్యాయత్నం చేసినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈమేరకే కేసు నమోదు చేసి నిందితుడ్ని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పద్మావతి అమ్మవారి సేవలో ప్రముఖులు

తిరుచానూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువైన పద్మావతి అమ్మవారిని బుధవారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. ఏపీ జైళ్ల శాఖ డీజీ అంజనీకుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధి కారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగావారు ధ్వజ స్తంభానికి నమస్కరించి అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే డ్రమ్స్ శివమణి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు.

టీడీపీతోనే ప్రజా సంక్షేమం




శ్రీకాళహస్తి పట్టణం, చోడవరంలలో కరపత్రాల పంపిణీ

శ్రీకాళహస్తి, జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే రాష్ట్రప్రభుత్వ ధ్యేయమని టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 17, 27, 35 వార్డుల్లో ఇంటింకి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. అన్న కాంటీన్లు, రైతులకు 9గంటలు ఉచిత విద్యుత్, చేనేతలకు 500 యూనిట్లు, హ్యాండ్ లూమ్స్‌కు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, దీపం పథకం అందిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 15నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నట్టు వివరించారు. అనంతరం సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కంఠా రమేష్, షాకీరాలీ, ఆర్ముగం, షఫీ తదితరులు పాల్గొన్నారు. ఇక పట్టణంలోని 23వ వార్డులో మాజీ కౌన్సిలర్ నాగమల్లి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతవీరాపురంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని జడ్పీటీసీ మాజీ సభ్యుడు పేరం ధనంజయులునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు నాగరాజనాయుడు, గురవారెడ్డి, పొన్నారావు, శివశంకర్‌రెడ్డి, మోహన్‌నాయుడు, మునిరంగారెడ్డి, దొరస్వామి, విజయకుమార్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

● తొట్టంబేడు మండలంలోని చోడవరంలో రిషితారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు రావిళ్ల మునిరాజానాయుడు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. జయచంద్రనాయుడు, చంద్రారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కుట్రలను తిప్పికొడదాం



ఇందిరానగర్‌లో నాయకులకు స్వాగతం

వరదయ్యపాళెం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ చేస్తున్న కుట్రలు, దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం సమన్వయకర్త కూరపాటి శంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇందిరానగర్‌లో సుపరి పాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి ప్రలజకు వివరించారు.నిర్మల్, దశరథన్, భారతి, జయచంద్రనాయుడు, నందకిషోర్‌రెడ్డి, కరుణాకర్‌నాయుడు, సుదర్శన్‌రెడ్డి, బీజేపీ, జనసేన నాయకులు దిలీప్‌రాయల్, చిరంజీవి పాల్గొన్నారు.

భారీ వాహనాలతో వీధులు ధ్వంసం



లారీలను నిలిపివేసిన స్థానికులు

రేణిగుంట, జూలై 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో భారీ వాహనాలు రాకపోకలతో అంతర్గత రోడ్లు గుల్ల అవుతున్నాయి. గతంలో వీధుల్లో ఏర్పాటు చేసిన గోడౌన్లకు పంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీ చేసినా వారు పట్టించుకోలేదు. పట్టణం వెలుపల ఏర్పాటు చేసుకోవాల్సిన గోడౌన్లను స్థానిక వీధుల్లో ఏర్పాటు చేసుకున్నారు. ఈ గోడౌన్లకు నిత్యం సరుకులు దింపేందుకు భారీ లారీలు ఇరుకు వీధుల్లో రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్డు ధ్వంసమవుతున్నాయి. పోస్టాఫీస్ వీధి, జీఎం స్ట్రీట్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ వీధి, గుంటకట్ట వీధుల్లో రోడ్లు ధ్వంసమయ్యాయి. ఈ క్రమంలో పట్టణంలోని ఓ గోడౌన్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి కేవలం రాత్రి సమయంలో మాత్రమే సరుకులు దింపుకోవాలని హెచ్చరించారు. అయినా ఎవ్వరూ లెక్క చేయడం లేదు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఓ లారీ సరుకు దింపేందుకు రాగా రోడ్డు పక్క ఆగి ఉన్న కారుకు అతి సమీపంలో వెళ్లడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం తలెత్తింది. రోడ్ల ధ్వంసంపై ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రభురావుని వివరణ కోరగా... రోడ్లు ధ్వంసం చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయడమే కాక నష్టపరిహారం వసూలు చేస్తామని చెప్పారు.

రైతు సేవా కేంద్రాల్లో అన్నదాత సుఖీభవ అర్హుల జాబితా

తిరుపతిరూరల్, జూలై9(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలో అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి అర్హులైన రైతుల జాబితాను రైతుసేవాకేంద్రం, సచివాలయంలో ప్రదర్శించారని మండల వ్యవసాయాధికారి సుబ్బారావు పేర్కొన్నారు. మండలంలో 27గ్రామాలకు సంబంధించి 182మంది రైతుల ఈకేవైసీ పెండింగ్‌లో ఉందని, అర్హత ఉన్న రైతులు ఈనెల13లోపు ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు.

పుత్తూరు వార్తలు

కూటమితోనే సుపరిపాలన: ఎమ్మెల్యే భానుప్రకాష్



పుత్తూరు అర్బన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమని, అభివృద్ధి, సంక్షేమం, శాంతిభద్రతల నడుమ ప్రజలు ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతున్నారని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. పుత్తూరు పట్టణంలోని ఎన్జీవో కాలనీ, హరిజనవాడలో బుధవారం ఎమ్మెల్యే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం చేపట్టారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు డాక్టర్ సుధాకర్ పర్యవేక్షణలో ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి పథకాల కరపత్రం అందజేశారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, పార్టీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, కార్యదర్శి ఎంఎన్ ధనపాల్, మాజీ ఎంపీపీ ఏలుమలై(అమ్ములు), మార్కెట్ యార్డ్ చైర్మన్ డీఎస్ గణేష్, మున్సిపల్ మాజీ ఛైర్మన్లు అంకయ్య, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెలో కదం తొక్కిన కార్మికులు



పుత్తూరు టౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా పుత్తూరు పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు కదం తొక్కారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్, ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యుడు మహేష్ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన వ్యక్తం చేశారు. నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని, పనిగంటలను పెంచే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ డివిజన్ అధ్యక్షురాలు మునికుమారి, కార్యదర్శి విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా అష్టోత్తర శత కలశాభిషేకం



వడమాలపేట, జూలై 9(ఆంధ్రజ్యోతి): అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం శాస్త్రోక్తంగా అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించారు. ఉభయ దేవేరులతో ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలకు వేదామంత్రాలు పఠిస్తూ 108 కలశ జలాలతో అభిషేకం నిర్వహించారు. ఉదయం 8 నుంచి 10 గంటల మధ్య నిర్వహించిన అభిషేకంలో భక్తులు విశేషంగా పాల్గొని స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రతినెలా రెండో బుధవారం రూ.516 చెల్లించి సంప్రదాయ దుస్తులతో శత కలశాభిషేకంలో భక్తులు పాల్గొనవచ్చని ఆలయ అధికారి శివకుమార్ చెప్పారు.

జాతరలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



పుత్తూరు అర్బన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్జీవో కాలనీ, హరిజనవాడలో జరిగిన జాతరల్లో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వడమాలపేట(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో పిడతల గంగమ్మ తల్లికి బుధవారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వివేకానంద, రఘురామ్, సురేష్, ధనయ్య, చెంచయ్య ఆచారి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

నేడు మెగా పేరంట్స్, టీచర్స్‌మీటింగ్

కేవీబీపురం, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలో పాఠశాలలో ఈనెల 10న జరిగే మెగా పేరంట్స్, టీచర్స్ సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు ఆయా గ్రామ పాఠశాలలకు హాజరు కావాలని ఎంఈవో లక్ష్మీపతి, రవికుమార్ కోరారు. ఈ సమావేశంలో పాఠశాలల్లో సమస్యలు చర్చించే అవకాశం ఉందన్నారు.



వైభవంగా పార్వేట ఉత్సవం

శ్రీకాళహస్తి, జూలై 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వ రాలయానికి అనుబంధంగా పట్టణంలోని చెన్నైరోడ్డులో కొలువై ఉన్న ద్రౌపదీ సమేత ధర్మారాజస్వామి ఆలయంలో బుధవారం పార్వేట ఉత్సవం నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో స్వామిఅమ్మవార్లకు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. విశేషంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఆ తరువాత మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేదవంత్రాల నడుమ స్వామి అమ్మవార్లను చప్పరంపై అధిష్టింపజేసి పట్టణంలో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కార్పొరేట్లకు ఊడిగం చేసేలా లేబర్ కోడ్లు

వాడవాడలా కార్మిక, కర్షకుల నిరసనలు




శ్రీకాళహస్తి, పిచ్చాటూరు పట్టణాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలు

శ్రీకాళహస్తి, జూలై 9(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేసేలా లేబర్ కోడ్లు ఉన్నాయని కార్మిక సంఘాల నాయకులు విరుచుకుపడ్డారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, కర్షక చట్టాలకు వ్యతిరేకంగా శ్రీకాళహస్తిలో బుధవారం కార్మిక సంఘాలు చేపట్టిన సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ అనుబంధ సంఘాల నుంచి వందలాది మంది కార్మికులు, కర్షకులు రోడ్లపై వచ్చి వచ్చి కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పంచాయతీరాజ్ అతిథిగృహం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకురాలు భారతి మాట్లాడుతూ కార్మికులను కట్టు బానిసలు చేసి కార్పొరేట్లకు ఊడిగంచేయించేలా లేబర్ కోడ్లు ఉన్నాయని తెలిపారు. పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించి కనీస వేతన చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.మల్లికార్జున్, కార్తీక్, జనమాల గురవయ్య, కత్తి రవి, వైఎస్ మణి, గోపి, పాండు, మురళి, సెల్వ, పెనగడం గురవయ్య, గంధం మణి, వెంకటేష్, వేణు, రేవతి, భారతి రాపూరు సుబ్రహ్మణ్యం, జాకీర్ తదితరులు పాల్గొన్నారు. టీయూసీసీ ఆధ్వర్యంలో కూడా సార్వత్రిక సమ్మె నిర్వహించారు.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాదరావు మాట్లాడుతూ... స్కీం వర్కర్లకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, సుప్రీం కోర్టు తీర్పు మేరకు కనీస వేతన చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెల్వరాజ్, ధనమ్మ, అంబిక, ధరణి, విజయ, లక్ష్మి, మనీలా, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. రైల్వే విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ కూడలి నుంచి పోలీస్‌స్టేషన్, వెంకటగిరి రోడ్డు మీదుగా అంబేడ్కర్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కరీముల్లా, రంగయ్య, రాంబాబు, వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ నాయకులు భాగ్యలక్ష్మి, పాండురంగమ్మ పాల్గొన్నారు.

కేవీబీపురం (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో మండలంలోని ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, అసంఘటిత కార్మికులు ర్యాలీ చేపట్టారు. సాయిబాబా ఆలయం వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. రాజేశ్వరి, సరళ, పద్మ, రమణమ్మ, శంకరయ్య, పోలయ్య, ధనలక్ష్మి, జ్యోతి, రాణి, దీప తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): జిల్లా రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బీఎన్‌కండ్రిగలోని ప్రధాన రహదారిలో సమ్మె జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి దాసరి జనార్దన్, మండల కార్యదర్శి నలుగూరు రమణయ్య, కృష్ణమ్మ, శంకరమ్మ, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులతో కలసి పిచ్చాటూరులో భారీ ర్యాలీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్దన్, సీపీఎం మండల కార్యదర్శి రామచంద్రారెడ్డి, అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి ఇంద్రాణి మండల అధ్యక్షురాలు కృష్ణవేణి పాల్గొన్నారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ డివిజన్ కార్యదర్శి మెలుగు రమేష్ ఆధ్వర్యంలో సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు తహసీల్దార్ కార్యాలయం నుండి శ్రీకాళహస్తి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద బైఠాయించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మురళి, మునస్వామి, నిర్మల, తిరుమలరెడ్డి, పళని తదితరులు పాల్గొన్నారు.

నాగలాపురం (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ మండల కార్యదర్శి మురుగేశ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఉపాధి కూలీలు పని ప్రదేశంలో నిరసన తెలిపారు.

వాహన తనిఖీలు

శ్రీకాళహస్తి, జూలై 9(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని మేర్లపాక టోల్ గేట్ వద్ద బుధవారం మోటరు వాహన తనిఖీ అధికారి దామోదర్‌నాయుడు ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఇందులోభాగంగా మూడు ఆర్టీసీ బస్సులు, ఓ కంపెనీకి చెందిన బస్సు టోల్ గేటు నుంచి ఏర్పేడు హైవేలో వ్యతిరేక దిశలో వెళుతున్నాయి. వాటిని గుర్తించి రూ.8వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిలో ఆటోలు, ద్విచక్ర వాహనదారులు టోల్‌గేట్ నుంచి ఏర్పేడుకు వ్యతిరేక దిశలో వెళుతున్నారన్నారు. ఇలా వెళ్లడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు.

ముక్కంటి సేవలో ఐఏఎస్ అధికారులు




ఆలయం వద్ద ఐఏఎస్ అధికారులు - వెంకట సత్యనారాయణ తదితరులు

శ్రీకాళహస్తి, జూలై 9(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని పలువురు ఐఏఎస్ అధికారులు దర్శించుకున్నారు. శ్రీనివాస్, ఇషా కలియా, రోహిత్ కక్కర్, నారపురెడ్డి మౌర్య తదితరులకు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుం జయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఇక రాజ్యసభ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ పాక వెంకటసత్యనారాయణ దర్శించుకున్నారు. ఆయనకు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. కండ్రిగ ఉమ, మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, వేడాం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన కేంద్ర గృహ నిర్మాణశాఖ కార్యదర్శి

వరదయ్యపాళెం,జూలై 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆర్ శ్రీనివాస్ ఆ శాఖ ఉన్నతాధికారులతో బుధవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ప్రెసిడెంట్(ఆపరేషన్స్) సతీష్ కామత్ ఆయనకు స్వాగతం పలికి శ్రీసిటీ ప్రణాళిక, ప్రస్థానం, పారిశ్రామిక ప్రగతిని వివరించారు. ప్రస్తుత పారిశ్రామిక కార్యకలాపాలు, భవిష్యత్తు విస్తరణ వ్యూహాలు, మౌలిక సదుపాయాలు, నివాసగృహాల డిమాండ్ ముఖ్యంగా డార్మిటరీలు, తక్కువ ఆదాయ వర్గాలకు సరసమైన అద్దె గృహాలపై చర్చించారు. ఇతర పారిశ్రామిక ప్రాంతాల్లో విజయవంతమైన గృహప్రణాళికల నమూనాలను అధ్యయనం చేయాలని, కేంద్ర గృహ నిర్మాణశాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా వినూత్న ప్రతిపాదనలతో ముందుకు రావాలని ఆయన శ్రీసిటీ బృందానికి సూచించారు. అనంతరం శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ... కేంద్ర గృహ నిర్మాణశాఖ ఉన్నతాధికారులు శ్రీసిటీని పరిశీలించడం ఆనందంగా ఉందన్నారు. శ్రీనివాస్ శ్రీసిటీ పరిసరాలతో పాటు ఆల్‌స్టోమ్ పరిశ్రమను సందర్శించారు. కేంద్ర గృహ నిర్మాణ శాఖ సంయుక్త కార్యదర్శి ఇషా కాలియా, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిమూలం

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. మండలంలోని పుత్తేరిలో సిమెంట్ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన పుత్తేరిని ఆదర్శ పంచాయతీగా ఎంపిక చేశామన్నారు. గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ పార్థసారథి సహకారంతో ఇప్పటికే పలు కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. సర్పంచ్ రామ్మూర్తి తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో వెంకటరత్నమ్మ, ఎస్ఐ విశ్వనాథనాయుడు, నాయకులు మునిచంద్రనాయుడు, రవినాయుడు, కార్తిక్‌నాయుడు, వీరరాఘవులు, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ప్రదోష నంది సేవ

శ్రీకాళహస్తి, జూలై 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రదోష నందిసేవ శాస్త్రోక్తంగా జరిగింది. ముందుగా ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం మంగళవాయిద్యాలు, మేళతాళలు, వేదమంత్రాల నడుమ నందిపై అధిష్టింపజేశారు. ఆలయ ప్రాకారంలో ప్రదోష నందిసేవ నిర్వహించారు.

మూడిళ్లలో చోరీలు... రెండిళ్లలో యత్నం



విజయ ఇంట్లో చిందరవందరగా ఉన్న వస్తువులు

శ్రీకాళహస్తి, జూలై 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం రాత్రి మూడిళ్లల్లో చోరీలు జరిగాయి. సాలిపేటకు చెందిన విజయ గృహిణి. ఆమె భర్త నాగేంద్ర కువైట్‌లో ఉంటూ కుటుంబాన్ని పోషిస్తుంటాడు. వీరికి ఇద్దరు ఆడపిల్లలున్నారు. మంగళవారం రాత్రి ఇంటికి తాళం వేసి పక్కనే ఉన్న తల్లి ఇంట్లో నిద్రించింది. గుర్తు తెలియని దొంగలు ఇంట్లోకి చొరబడి రెండు బీరువాలను ధ్వంసం చేసి 86 గ్రాములు బంగారు ఆభరణాలు, 180 గ్రాములు వెండి వస్తువులు, రూ.30వేలను చోరీ చేశారు. ఆ ఇంటికి దక్షిణం వైపున మూడో ఇంట్లో నివసిస్తున్న మునిరాజా మంగళవారం రాత్రి పట్టణంలోని బంధువుల ఇంట్లో కార్యానికి కుటుంబ సమేతంగా వెళ్లాడు. వారింట్లో దొంగలు పడి 16 గ్రాముల బంగారు చైను, సుమారు 500 గ్రాముల వెండి వస్తువులు, రూ.10వేలతో పాటు పిల్లల విద్యా సర్టిఫికెట్లను చోరీ చేశారు. ఇదే సాలిపేటలోని మరో ఇంట్లో 200 గ్రాముల వెండిని చోరీ చేశారు. ముత్యాలమ్మగుడివీధిలో ఓ ఇంటి తాళాలు పగులగొట్టి చొరబడ్డారు. అయితే ఎలాంటి విలువైన వస్తువులు చోరీకి కాలేదు. ఇక సబ్‌జైల్ పక్కనే మంగళవారం అర్ధరాత్రి కొందరు గుర్తు తెలియని యువకులు ద్విచక్రవాహనాన్ని ఓ ఇంటి ముందు పెట్టి పక్కనే ఉన్న ఇంట్లోని మొదటి అంతస్తులోకి చొరబడ్డారు. ఆ ప్రాంతానికి చెందిన యువతి ద్విచక్ర వాహనాన్ని వీడియో తీసి పోలీసులకు అందించినట్టు తెలిసింది.

రేషన్‌కార్డు నుంచి పేర్ల తొలగింపు

పిచ్చాటూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డు నుంచి వివిధ కారణాలతో పేర్లను తొలగింపునకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తహసీల్దార్ సుబ్రహ్మణ్యం చెప్పారు. బుధవారం తన ఛాంబర్‌లో మాట్లాడుతూ ఉమ్మడి కుటుంబంలో కార్డుదారులై ఉండి పెళ్లైన తరువాత పక్క రాష్ట్రాలకు, జిల్లాలకు, విదేశాలకు వెళ్లిన వారు, వలస వెళ్లి అక్కడే స్థిరపడిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమీపంలోని సచివాలయం వద్దకు వెళ్లి అర్జీ సమర్పిస్తే అధికారులు పరిశీలించి తొలగిస్తారని చెప్పారు.

కనకదుర్గమ్మ సేవలో సుధీర్

శ్రీకాళహస్తి, జూలై 9(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైఉన్న కనకదుర్గమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే సుధీర్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనాంతరం వేదపండితులు ఆయన్ను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

రేణిగుంట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు. బుధవారం స్థానిక కేఆర్పీ కళాశాల విద్యార్థులకు ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాల, మత్తు పదార్థాల పట్ల అవగాహన కలిగించారు. గాజులమండ్యం సీఐ మంజునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా యువత ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా రోస్‌రెడ్డి

పిచ్చాటూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా యువత విభాగ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా పిచ్చాటూరుకు చెందిన కేజీ రోస్‌రెడ్డి నియమితులయ్యారు. వైసీపీ అధినేత జగన్ ఆదేశాల మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా యువజన విభాగ కమిటీని పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. ఈ మేరకు పిచ్చాటూరుకు చెందిన కేజీ రోస్‌రెడ్డిని కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

చిత్రలేఖనంలో విద్యార్థి ప్రతిభ



జ్ఞాపిక అందుకుంటున్న రామకృష్ణ

కేవీబీపురం, జూలై 9(ఆంధ్రజ్యోతి): జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి చిత్తూరు జిల్లాస్థాయిలో కార్వేటిన గరం డైట్‌లో జరిగిన చిత్రలేఖనం పోటీల్లో కేవీబీపురం జడ్పీ ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థి రామకృష్ణ రెండో బహుమతిని సాధించాడు. ప్రిన్సిపాల్ దామోదరం చేతుల మీదుగా డైట్ కార్యాలయంలో జ్ఞాపిక అందుకున్నాడు. గైడ్‌టీచర్ మునస్వామి పాల్గొన్నారు.

వెటర్నరీ వర్సిటీని సందర్శించిన న్యాక్ పీర్ టీమ్

తిరుపతిరూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీని న్యాక్‌పీర్ టీమ్ మూడ్రోజుల పర్యటనలో భాగంగా బుధవారం కమిటీ సభ్యులు సందర్శించారు. వర్సిటీలో శుక్రవారం వరకూ హైబ్రిడ్ విధానంలో పర్యటన కొనసాగనుంది. తొలిరోజు బుధవారం వర్సిటీ హెడ్ క్వార్టర్, పలు డిపార్ట్‌మెంట్లని ఇద్దరు సభ్యులు పరిశీలించారు. వీరి పరిశీలనను న్యాక్ హెడ్ కేంద్రంలోని బృంద ప్రతినిధులు ఆన్‌లైన్ ద్వారా పర్యవేక్షిస్తున్నారని తెలిసింది. కాగా కమిటీకి ఆహ్వానం, జ్ఞాపికలకు దూరంగా ఉండాలని, వపతిని మాత్రమే కల్పించేలా చర్యలు చేపట్టాలని కేంద్రం నుంచి ఉత్తర్వులు అందాయి.